ఆశా కార్యకర్తలకు నమోదు పుస్తకాల పంపిణీ

కొత్తగూడెం వైద్యవిభాగం: ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ వివరాల నమోదు బాధ్యత ఆశా కార్యకర్తలపైనే ఉందని డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్‌నాయక్ అన్నారు. జిల్లాలోని 1,411 మంది ఆశా కార్యకర్తలకు నమోదు పుస్తకాల పంపిణీని తన కార్యాలయంలో సోమవారం అందజేశారు. స్త్రీ, శిశు ఆరోగ్య సంరక్షణ, తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగు, రోగ నిరోధక శక్తి పెంపు తదితర సేవలను ఆశా కార్యకర్తల ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. సాంక్రమిక, అసాంక్రమిక వ్యాధుల నివారణపై ఎన్‌హెచ్‌ఎం ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సుకృత, ప్రోగ్రాంల అధికారులు డా.బాలాజీ, మధువన్ పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సలహాలకు.. 'టోల్ ఫ్రీ నంబర్ 15100'



స్టిక్కర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

కొత్తగూడెం న్యాయవిభాగం: ఉచిత న్యాయ సలహాలకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబరు 15100 స్టిక్కరును ఆ సంస్థ జిల్లా ఛైర్మన్ పాటిల్ వసంత్ తన ఛాంబరులో సోమవారం ఆవిష్కరించారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ: ఇటీవల హైకోర్టు పలువురు న్యాయమూర్తులకు ఉద్యోగోన్నతులు కల్పించింది. జిల్లాలో ప్రమోషన్ పొందిన బత్తుల రామారావు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు సోమవారం చేపట్టారు. ఇప్పటివరకు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా వ్యవహరించిన జి.భానుమతికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడెం మూడో అదనపు జ్యుడిషియల్ మొదటి శ్రేణి న్యాయమూర్తిగా పనిచేస్తున్న (ప్రస్తుతం శిక్షణలో) వి.శివనాయక్‌ను భద్రాచలం జ్యుడిషియల్ మొదటి శ్రేణి న్యాయమూర్తిగా హైకోర్టు బదిలీ చేసింది.



చాతకొండ ఆరో బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల స్తూపానికి నివాళి అర్పిస్తున్న సిబ్బంది

పోలీసు పరేడ్ మైదానంలో కలెక్టర్ జితేశ్ వి.పాటిల్

ఎస్పీ బి.రోహిత్‌రాజు

శాంతియుత సమాజ నిర్మాణమే పోలీసుల ప్రథమ కర్తవ్యం


కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: శాంతియుత సమాజ నిర్మాణమే పోలీసుల ప్రథమ కర్తవ్యమని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతోనే ఇది సాధ్యమని అభిప్రాయపడ్డారు. విధుల్లో భాగంగా సంఘ విద్రోహశక్తులతో పోరాడి మరణించిన పోలీసు అమరవీరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్‌డే) జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ పరేడ్ మైదానంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్‌కు ఎస్పీ బి.రోహిత్‌రాజు ఆహ్వానం పలికారు. పరేడ్ కమాండర్ లాల్‌బాబు ఆధ్వర్యంలోని సాయుధ దళం నుంచి కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎస్పీతో కలిసి అమరవీరుల స్మారక స్తూపం వద్ద నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశ అంతర్గత భద్రత, ప్రజా, ప్రభుత్వ ఆస్తుల రక్షణలో పోలీసు వ్యవస్థ కీలకంగా పనిచేస్తుందన్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ, ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి సంఘ విద్రోహ శక్తులతో పోరాడిన అమరుల త్యాగాలు వెలకట్టలేనివని ఎస్పీ బి.రోహిత్‌రాజు తెలిపారు. పోలీసు వ్యవస్థ పటిష్ఠంగా ఉంటే అభివృద్ధి ప్రతి ఒక్కరికీ దరిచేరుతుందనడానికి తెలంగాణ రాష్ట్రమే నిదర్శనమన్నారు. ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా తీవ్రవాదులు, సంఘ విద్రోహ శక్తుల చేతుల్లో అమరులైన 214 మంది పేర్లను అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్ చదివి వినిపించారు. కార్యక్రమంలో డీఎస్పీలు షేక్ అబ్దుల్ రెహ్మాన్, చంద్రభాను, మల్లయ్యస్వామి, రవీందర్‌రెడ్డి, సతీశ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐ, ఆర్ఐ, ఎస్సైలు, పోలీస్ కార్యాలయం, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

★ చాతకొండ ఆరో బెటాలియన్‌లో అదనపు కమాండెంట్ ఎ.అంజయ్య ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. అమరవీరుల స్తూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అసిస్టెంట్ కమాండెంట్ ఎం.డి.రషీద్, ఆర్ఐలు రామసత్యనారాయణ, శ్రీరాం, బ్రహ్మం, జీవీ రామారావు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాల్లో.. ఆరు తేరేలా!

పాల్వంచ, ఖమ్మం విద్యా విభాగం, న్యూస్‌టుడే

యువతలో సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరిచి, ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐ కళాశాలల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లను ప్రారంభిస్తోంది. 2024-25 విద్యా సంవత్సరంలో ఏడాది వ్యవధితో ఆరు కొత్త కోర్సులను ప్రవేశపెట్టింది. ఈనెల 30 వరకు దరఖాస్తులు స్వీకరించనుంది. పది, ఆపై విద్యార్హతలు కలిగిన వారిని ఆధునిక సాంకేతిక నైపుణ్యాల్లో తీర్చిదిద్దటమే ఏటీసీల లక్ష్యం. ఖమ్మం, కొత్తగూడెం, మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో 172 చొప్పున.. మొత్తం 516 మందికి ఈ ఏడాది ప్రవేశం కల్పించనున్నారు.



'మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్‌లో 40, ఇండస్ట్రియల్ రోబోటిక్‌లో 40, ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్‌లో 20, రెండేళ్ల కోర్సులైన బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫైయర్‌లో 24, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్‌లో 24, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్‌లో 24 సీట్లు ఉంటాయి. కోర్సు పూర్తయ్యాక ఇంటర్వ్యూలు నిర్వహించి, ప్రతిభ ఆధారంగా టాటా, మహీంద్రా వంటి కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు అందజేయొచ్చు' అని కొత్తగూడెం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ గోనెల రమేశ్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

1. అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషినింగ్ టెక్నీషియన్

భారత్ డైనమిక్స్, డీఆర్‌డీఓ వంటి పరిశోధన, అనుబంధ ఉత్పత్తి సంస్థల్లో ఉపాధి అవకాశాలను కల్పించే కోర్సు. మిషన్ ఆపరేషన్, కంప్యూటర్ ప్రోగ్రాంలు రాయడం, మెషిన్ ట్రబుల్, గేర్ కటింగ్, బోల్ట్ నట్ తయారీ వంటి అంశాలు నేర్పిస్తారు. సీఎన్‌సీ మెషిన్ టెక్నీషియన్, ప్రోగ్రాం డిజైనర్, కోడ్ రైటర్, ప్రొడక్ట్ డిజైనర్ వంటి కొలువులుంటాయి.

2. మ్యాను ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్, ఆటోమేషన్

ఈ కోర్సులో పీఎల్‌సీ, సీఎన్‌సీ ప్రోగ్రామింగ్‌తో పాటు ఆటోమేషన్, సెన్సార్లు, యాక్చుయేటర్లు-కంట్రోలింగ్, రోబోటిక్స్, మెకాట్రానిక్స్, ప్రాసెస్ కంట్రోల్, మేనేజ్‌మెంట్, నాణ్యత నియంత్రణ అంశాలను నేర్పిస్తారు. వీటితో పాటు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, న్యూమాటిక్స్-హైడ్రాలిక్స్‌లో మెలకువలు చెబుతారు. ఆటోమోటివ్, ఏరోస్పేస్, ఔషధ, ఆహార శుద్ధి, రసాయన, వస్త్ర, చమురు శుద్ధి రంగాల్లో అవకాశాలు లభిస్తాయి. ఆటోమేషన్ టెక్నీషియన్, ప్రాసెస్ కంట్రోల్ ఇంజినీర్, నాణ్యత నియంత్రణ ఇన్‌స్పెక్టర్, రోబోటిక్ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్ వంటి ఉద్యోగావకాశాలుంటాయి.



రుద్రంపూర్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించిన ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ సీతారాములు, కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ (పాతచిత్రం)

3. మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్

ఎలక్ట్రికల్ వెహికిల్ ఆర్కిటెక్చర్, బ్యాటరీ నిర్వహణ, పవర్ ఎలక్ట్రానిక్స్, ఛార్జింగ్ సిస్టం, ట్రబుల్ షూటింగ్‌లో శిక్షణ ఇస్తారు. ఎలక్ట్రిక్ వెహికిల్, బ్యాటరీ టెక్నీషియన్, ఈవీ మెయింటెనెన్స్ ఇంజినీర్, సర్వీస్ సెంటర్ మేనేజర్ వంటి ఉపాధి అవకాశాలుంటాయి. ఈవీ, పునరుత్పాదక ఇంధన రంగంలో స్థిరపడొచ్చు.

4. బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫైయర్(మెకానికల్)

మెకానికల్ డిజైన్, సాలిడ్ వర్క్స్ ఆటో డెస్క్ (సీఏడీ) సాఫ్ట్‌వేర్, సీఏఈ(సాఫ్ట్‌వేర్, ఎనిసిస్, సిములింక్), 3డీ మోడలింగ్-అనుకరణ, వర్చువల్ ధ్రువీకరణ, డిజైన్ ఫర్ మ్యాన్యుఫ్యాక్చరబిలిటీ (డీఎఫ్‌ఎం), రేఖాగణిత డైమన్షనింగ్, టాలరెన్సింగ్ అంశాల్లో నైపుణ్యాలు నేర్పిస్తారు. మెకానికల్ డిజైన్ ఇంజినీర్, వెరిఫికేషన్ ఇంజినీర్, సీఏటీ టెక్నీషియన్, ఎనలిస్ట్, వర్చువల్ టెస్టింగ్ ఇంజినీర్, ప్రొడక్షన్ డెవలప్‌మెంట్ ఇంజినీర్‌గా అవకాశాలుంటాయి.

5. ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్

చేతివృత్తులు, హస్తకళలు, ఆభరణాలు, వాచ్ మేకింగ్, శిల్పం, నమూనా తయారీ, ప్రెసిషన్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఆటోమేషన్ తదితర రంగాల్లో ఉపాధి కల్పించే కోర్సు. డిజైన్, ప్రెసిషన్ క్రాఫ్టింగ్, ఫినిషింగ్, డిజైన్, విజువలైజేషన్, మెటీరియల్ ఎంపిక, ప్రాసెసింగ్, 3డీ ముద్రణ అంశాల్లో నైపుణ్యాలు నేర్పిస్తారు. మాస్టర్ క్రాఫ్ట్స్‌మాన్, టూల్, డై మేకర్, ప్రెసిషన్ ఇన్‌స్ట్రుమెంట్ మేకర్, జ్యువెలరీ-ఫర్నిచర్ డిజైనర్, మేకర్ వంటి ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

6. ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్

పారిశ్రామిక రోబోటిక్స్‌లో ప్రాథమిక భావనలు, ప్రోగ్రామింగ్, డిజిటల్, ఆటోమేషన్, కంట్రోల్ సిస్టం, సెన్సార్ ఇంటిగ్రేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-మిషన్ లెర్నింగ్‌లో ప్రావీణ్యం సంపాదించేలా తర్ఫీదు ఇస్తారు. రోబోటిక్ టెక్నీషియన్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ ఇంజినీర్, ఆటోమేషన్, పారిశ్రామిక రంగాల్లో నైపుణ్య సిబ్బందిగా రాణించవచ్చు.

పేదింటి కల..
సాకారం దిశగా..

ఈటీవీ, ఖమ్మం: నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా సర్కారు అడుగులు వేస్తోంది. తొలి విడతలో ప్రతి శాసనసభ నియోజకవర్గానికి 3,500-4,000 ఇళ్ల చొప్పున మంజూరు చేస్తామని ప్రకటించింది. గ్రామాలు, పట్టణాలు, నగరాల వారీగా లబ్ధిదారుల ఎంపిక కోసం ఇందిరమ్మ ఇళ్ల కమిటీల నియామకాలకు శ్రీకారం చుట్టింది. దీపావళి నాటికి తొలి విడత లబ్ధిదారులను ఎంపిక చేయాలని భావిస్తోంది. ఈమేరకు 'ప్రజాపాలన'లో అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులను గుర్తించేందుకు ఇందిరమ్మ కమిటీలు రంగంలోకి దిగనున్నాయి.

ఉభయ జిల్లాల్లో..
- గ్రామ పంచాయతీలు: **1,065**
- ఖమ్మం నగరపాలికలో డివిజన్లు: **60**
- ఏడు పురపాలికల్లో వార్డులు: **169**

దీపావళి కానుక..!

ఇందిరమ్మ ఇళ్ల కోసం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో లక్షలాది దరఖాస్తులందాయి. భారాస హయాంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లను సైతం ఈపథకంలోకి చేర్చి లబ్ధిదారులకు అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీపావళి నాటికి తొలివిడత లబ్ధిదారులను ప్రకటిస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల ప్రకటించారు. ఉభయ జిల్లాల్లో 35వేల నుంచి 40వేల మంది నిరుపేదలకు సొంతింటి యోగం దక్కనుంది. సొంతంగా జాగా కలిగిన ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు, ఇతరులకు రూ.5 లక్షల చొప్పున ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందించనుంది.

క్షేత్రస్థాయిలో అర్హులను గుర్తించేందుకు ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యింది. ప్రజాపాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తులను పరిశీలించనున్నాం. తొలిదఫాలో ఎంపికైన లబ్ధిదారులకు సంబంధించి ఇళ్ల నిర్మాణ పనులు త్వరలోనే మొదలవుతాయి. రెండు పడక గదుల ఇళ్లను సైతం లబ్ధిదారులకు కేటాయిస్తాం.
- ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం కలెక్టర్

రంగంలోకి కమిటీలు..

పంచాయతీల పాలకవర్గాల గడువు ముగియటంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. పల్లెల్లో గ్రామ ప్రత్యేకాధికారి, నగరపాలికల్లో డివిజన్ కార్పొరేటర్, పురపాలికల్లో వార్డు కౌన్సిలర్ ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటవుతాయి. ప్రతి కమిటీలో ఏడుగురు సభ్యులుంటారు. ఒక్కో కమిటీకి గ్రామ ప్రత్యేకాధికారి, గ్రామ కార్యదర్శి, స్వయం సహాయక సంఘాల మహిళలు ఇద్దరు, స్థానికులు ముగ్గురు (ఎస్సీ, ఎస్టీల్లో ఒకరు, ఒక బీసీ, ఇతరులు మరొకరు) ప్రాతినిధ్యం వహిస్తారు. సభ్యులంతా పేద, మధ్యతరగతికి చెందిన వారై ఉండాలి. ఈ కమిటీల ఆధ్వర్యంలో గ్రామ, వార్డు, డివిజన్ సభలు జరుగుతాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులను గుర్తించటం, అనర్హులు ఇళ్ల బిల్లులు తీసుకుంటే వారిపై ఫిర్యాదు చేయటం వంటి బాధ్యతలను ఈ కమిటీలకు ప్రభుత్వం కట్టబెట్టింది. లబ్ధిదారులకు జాతీయ ఆహార భద్రత కార్డు తప్పనిసరిగా ఉండాలి. సొంతింటి జాగా కలిగి పక్కా ఇళ్లు లేనివారు ఈ పథకానికి అర్హులు.

పట్టణ భూములకు పక్కాగా లెక్కలు..!

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం

పట్టణ భూములకు పక్కాగా లెక్కలుండేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ఇప్పటి వరకు సాగు భూములకు ఉండే నక్షా మాదిరిగా.. పట్టణాలకు సైతం రూపొందించేలా చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 100 పట్టణాలకు నక్షా రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసింది. అందులో రాష్ట్రం నుంచి ఎనిమిది పట్టణాలుండగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి మణుగూరు పురపాలికను పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది.



పురపాలిక పరిధిలో కొనసాగనున్న సర్వే

అన్నారం, చిన్నరావిగూడెం, అనంతారం, మణుగూరు రెవెన్యూ గ్రామాలను కలిపి మణుగూరు పురపాలికగా ఏర్పాటు చేశారు. దీని పరిధిలో అధికారులు సర్వే జరుపుతారు. సర్వే ఆఫ్ ఇండియా, పురపాలిక, భూమి కొలతలు- దస్త్రాల నిర్వహణ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా పైలెట్ ప్రాజెక్టును చేపట్టనున్నారు. నక్షా పథకంలో ప్రతి ఇల్లు, ఆస్తిని పక్కాగా సర్వే చేయనున్నారు. అక్షాంశాలు, రేఖాంశాలతో ఆస్తుల హద్దులు గుర్తించి వాటి విస్తీర్ణాలను డిజిటల్ పద్ధతిలో నిక్షిప్తపరుస్తారు. అనంతరం ఇల్లు లేదా ఆస్తికి 'ప్రాపర్టీ కార్డులు' అందజేస్తారు. వచ్చే డిసెంబరు నాటికి పైలెట్ సర్వే పూర్తిచేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పైలెట్ ప్రాజెక్టు కింద మణుగూరు పురపాలిక పరిధిలోని భూములను సమగ్రంగా సర్వే చేయనున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందాల్సి ఉంది.
- నరేష్, సర్వేయర్, మణుగూరు

తేలనున్న ఆక్రమణలు..

ఈ సర్వే ద్వారా మణుగూరు పురపాలిక పరిధిలోని ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన విస్తీర్ణాలు, వాటి హద్దులను అధికారులు గుర్తించనున్నారు. ఇప్పటివరకు అన్యాక్రాంతమైన భూముల వివరాలు తేలనున్నాయి. పురపాలిక పరిధిలో ఆక్రమణకు గురైన చెరువులు, కుంటల భూ వివరాలు వెలుగులోకి వచ్చే ఆస్కారముంటుంది. మురికి వాడలు, బస్తీలు, కాలనీల్లోని చిన్నచిన్న ఇళ్ల స్థలాలకు సైతం పటాలు రూపొందనున్నాయి.

యాజమాన్య హక్కులపై సందేహాలు

1/70 చట్టం పరిధిలోని మణుగూరు పురపాలికలో భూములు కొని నివాసముంటున్న గిరిజనేతరుల ఇళ్లు, ఆస్తులకు ప్రాపర్టీ కార్డులు ఎలా జారీ చేస్తారనే విషయంపై స్థానికుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే గిరిజనేతరులు కొన్న భూములకు బ్యాంకులు సైతం రుణాలివ్వటం లేదు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వమే ప్రాపర్టీ కార్డులు జారీ చేసి వాటి ద్వారా రుణాలు పొందే వెసులుబాటు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. 1/70 చట్టం అమలవుతున్న మణుగూరు లాంటి ప్రాంతాల్లో అధికారులు ఏవిధమైన చర్యలు తీసుకుంటారనేది ఆసక్తిగా మారింది. కేవలం చట్టం పరిధిలోకి వచ్చేవాటికి మాత్రమే కార్డులు జారీ చేస్తారా? లేక అన్నింటికీ ఇస్తారా అనేది వేచిచూడాలి.

డబ్బులు మాయం..
ఖాతాదారుల్లో అయోమయం..!

అశ్వాపురం, న్యూస్‌టుడే

అశ్వాపురం మండలం నెల్లిపాకబంజర లోని నెల్లిపాక తపాలా బ్రాంచి కార్యాలయంలో రూ.లక్షల గోల్‌మాల్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. డిపాజిట్ సొమ్మును ఖాతాల్లో జమచేయకుండా పక్కదారి పట్టించటం గమనార్హం.

బయటపడిందిలా.. నెల్లిపాక తపాలా కార్యాలయంలో మంద్రు గోపాలరావు నాలుగు నెలల క్రితం రూ.6లక్షలు డిపాజిట్ చేశారు. ఆయన పేరిట ఖాతా తెరిచి నంబర్ సహా రసీదును అతికించి పాసుపుస్తకాన్ని సిబ్బంది అందించారు. వారం క్రితం భద్రాచలం ప్రధాన తపాలా కార్యాలయానికి గోపాలరావు వెళ్లారు. తన ఖాతాలోని డబ్బుల గురించి ఆరాతీయగా అదసలు పోస్టాఫీస్ ఖాతానే కాదని అక్కడి సిబ్బంది బదులిచ్చారు. నకిలీ ఖాతా అని తెలుసుకొని గోపాలరావు లబోదిబోమన్నారు. ఇదే విషయాన్ని గ్రామంలోని పలువురు ఖాతాదారులకు చేరవేశారు. నెల్లిపాక బ్రాంచికి చెందిన పలువురు ఖాతాదారులు భద్రాచలం, సారపాక వెళ్లి ఆరాతీయగా వారి ఖాతాల్లోనూ డబ్బులు జమకాలేదని తేలటంతో విషయం గుప్పుమంది.

అధికారులకు వినతి.. సాధారణ తనిఖీల్లో భాగంగా మణుగూరు ఐపీ రామమూర్తి, మెయిల్ ఓవర్సీల్ సుధీర్ నెల్లిపాక తపాలా కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా పలువురు బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మణుగూరు ఐపీ (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్స్), మెయిల్ ఓవర్సీల్ సోమవారం విచారించారు.



నెల్లిపాకలో విచారణ నిర్వహిస్తున్న మణుగూరు తపాలా కార్యాలయం సిబ్బంది

మచ్చుకు కొన్ని.. జి.మోహనరావు, కె.విజయ రూ.1.50లక్షల చొప్పున, జి.వెంకటరమణ, జి. వెంకటయ్య రూ.50వేల చొప్పున, కుమారస్వామి రూ.40వేలు ఇలా. . వీరందరి ఖాతాపుస్తకాల్లో డబ్బులు కట్టినట్లు ముద్రలు కనిపిస్తున్నాయి. బి.సంపత్ రూ.2లక్షలు, సీహెచ్ రాము రూ.54వేలు, బి.తిరుమల రూ.30వేలు కట్టినట్లు వీరి పాసుపుస్తకాల్లో ముద్రలు లేవు. డబ్బులు చెల్లించినట్లు రసీదులు లేవు. ముద్రలు ఉన్నా.. లేకపోయినా వీరందరి ఖాతాల్లో డబ్బులు జమకాకపోవటం గమనార్హం.

సమగ్రంగా విచారించిన అనంతరం ఎంతమంది ఖాతాల్లో ఎన్ని లక్షల డబ్బు జమ కాలేదో తెలుస్తుంది. నెల్లిపాక బ్రాంచి కార్యాలయం పోస్టమాస్టర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఖాతాదారులందరికీ న్యాయం చేస్తాం.
- రామమూర్తి, మణుగూరు ఐపీ

మహిళలపై దాడులు, శ్రమదోపిడీని ఎదుర్కొందాం

సీపీఎం జాతీయ నాయకురాలు బృందా కారాట్

కొత్తగూడెంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు ప్రారంభం

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: 'దేశవ్యాప్తంగా మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి. 28 శాతం మంది స్త్రీలు బాధితులే. గంటకు 50 మందిపై దాడులు జరుగుతున్నాయి. నాలుగేళ్లలో లైంగిక వేధింపులు, అత్యాచారాలు పెరిగాయి. తమపై లైంగిక దాడులు జరిగినట్లు రోజుకు 80 మంది మహిళలు న్యాయం కోసం ఆశ్రయిస్తుండటం బాధాకరం' అని రాజ్యసభ మాజీ సభ్యురాలు, సీపీఎం జాతీయ నాయకురాలు బృందాకారాట్ అన్నారు. ఆదివాసీ మహిళలపైనా దాష్టీకాలు ఆగడం లేదని, మతం కోణంలో మైనార్టీ స్త్రీలపై దాడులు, లైంగిక వేధింపులు జరుగుతున్నాయని ఆమె వ్యాఖ్యానించారు. పదేళ్లలో 65 వేల మంది వివాహితులు వరకట్న వేధింపులకు బలయ్యారని.. వీరిలో అత్యధికులు హిందువులేనని తెలిపారు. పురుషాధిక్య సమాజంలో నేటి మహిళ దోపిడీకి గురవుతోందని, దీనికి వ్యతిరేకంగా ఐక్యపోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. కొత్తగూడెంలో సోమవారం ప్రారంభమైన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 4వ రాష్ట్ర మహాసభలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. 'తెలుగు భాష రాకున్నా నా మనసు మీతోనే ఉంటుంది. సింగరేణిలో 49 శాతం మాత్రమే వాటా కలిగిన కేంద్రం ఆ సంస్థను ప్రైవేటు పరం చేసేందుకు యత్నిస్తోంది. సింగరేణి ప్రాంతాల్లో మహిళలు, ఆదివాసీలకు మనుగడ లేకుండా చేసే కుట్ర జరుగుతోంది. వారికి స్థానికంగా జీవించే హక్కు లేదా? కేంద్రం దృష్టిలో పేదలు, మహిళలకు విలువ ల్లేవు. అందుకే వారిని ఈ ప్రాంతం నుంచి వెళ్లగొడుతోంది' అని అన్నారు. కనీస వేతనాలకు నోచని మహిళా కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని ధ్వజమెత్తారు. 3 వేల కిలోల మట్టిని మోసేందుకు కేవలం రూ.250 ఉపాధి కూలి చెల్లిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఆన్‌లైన్ మస్టర్‌లో వేలిముద్రలు పడకపోవడంతో ఎందరో కూలీలు వేతనాలకు నోచుకోవడం లేదన్నారు. ఇదెక్కడి డిజిటల్ ఇండియా' అని కారాట్ ఎద్దేవా చేశారు. వాగ్దానాలు నెరవేర్చకుంటే ప్రభుత్వాన్ని నిద్రపోనివ్వం.. తెలంగాణ ఐద్వా ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం, ఉదయం, సూర్యావతి తదితరుల స్ఫూర్తితో రాష్ట్రంలో అనేక చోట్ల భూములు, ఇళ్ల స్థలాల కోసం పోరాటాలు జరిగాయి. ఎందరో జైళ్లకు వెళ్లారు. కానీ, ఇళ్లు, భూ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలి. ఇందులో భాగంగానే గత భారాస ప్రభుత్వాన్ని ఓడించారు. కొత్తగా కాంగ్రెస్ సర్కారును గెలిపించుకొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వాగ్దానాల్ని అమలు చేయలేకపోతే నిద్రపోనివ్వం' అని ఆమె హెచ్చరించారు. వంటింట్లో ఉల్లిగడ్డ కోస్తే కళ్లల్లోంచి నీరొచ్చేదని.. ప్రస్తుతం పెరిగిన ధరలతో వాటిని కొనుక్కోలేక కన్నీరు పెడుతున్నామని అభిప్రాయపడ్డారు. ఆకాశాన్నంటే నిత్యావసరాల ధరల నేపథ్యంలో మహిళల ఆహార భద్రత కోసం ఐద్వా పోరాడాలన్నారు.



కొమ్ములను ధరించిన బృందాకారాట్, మరియం థావలే



మహిళలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న బృందాకారాట్

అప్పుల ఊబిలోంచి బయటపడేయాలి... సనాతన వాదానికి వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని మాజీ ఎంపీ మిడియం బాబూరావు అన్నారు. పేద మహిళలు సంసారాన్ని నడిపేందుకు ఎన్నో అవస్థలు పడుతున్నారని, కొందరు మైక్రో ఫైనాన్స్ కంపెనీల విషవలయాల్లో చిక్కుకొంటున్నారని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం థావలే తెలిపారు. రైతుల రుణమాఫీ తరహాలో స్త్రీలను అప్పుల ఊబిలోంచి బయటపడేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మహిళలకు ఇచ్చిన హామీలను నిలబెట్టకపోతే భారాస మాదిరిగానే కాంగ్రెస్‌ను ఇంటికి పంపుతామని హెచ్చరించారు. మహిళలు సంఘటితమై బలమైన ఉద్యమాలను నడపాలని ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి కోరారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు గూడెంలో భారీ ప్రదర్శన చేపట్టారు. ప్రదర్శనలో కొమ్ము నృత్యం, డప్పు నృత్యం ఆకర్షణగా నిలిచాయి. సభలో అరుణ జ్యోతి, పుణ్యవతి, టి.జ్యోతి, బుగ్గవీటి సరళ, సీతాలక్ష్మి, ఎం.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మిరపలో లద్దె పురుగు

- వైరా, న్యూస్‌టుడే

ఉభయ జిల్లాల్లో పత్తి తర్వాత సాగయ్యే ప్రధాన వాణిజ్య పంట మిరప. ఖమ్మం జిల్లాతో పోల్చితే భద్రాద్రిలో సాగు విస్తీర్ణం అధికం. ఈ ఏడాది పైరు ఆరంభ దశలో వరుస వర్షాలు, వరదలు మొక్క ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతోపాటు కొన్ని రోజులుగా ఏదో ఒక సమయంలో వర్షాలు పడుతుండటంతో లద్దె పురుగు సమస్య తీవ్రమైంది. దీంతో పంటను లద్దె పురుగు తీవ్రంగా నష్టపరుస్తోందని, సస్య రక్షణ చర్యలు తీసుకోవాలని వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.రవికుమార్ రైతులకు సూచించారు.


లద్దెపురుగు ఆశించిన మిరప

ఇవీ లక్షణాలు


లద్దె పురుగు లార్వాలు ఆకులకు చిన్న రంధ్రాలు చేసి వాటిని జల్లెడగా మారుస్తాయి. కాపు దశలో మిరప కాయలను ఆశించి, ముచ్చిక వద్ద రంధ్రం చేస్తాయి. శరీర భాగమంతా కాయ లోపలకు వెళ్లి గింజలను, గుజ్జును తినేస్తాయి.

ప్రభావం ఇలా.. లద్దె పురుగు ఆశించిన పైరులో ఆకులను క్రమేణా తినేస్తుండటంతో అవి సారం కోల్పోతాయి. పంట దిగుబడిపై ప్రభావం పడి ఉత్పత్తి తగ్గిపోతుంది. పండిన పంట నాణ్యత కూడా తగ్గిపోతుంది. ఫలితంగా రైతులు ఎక్కువ మొత్తంలో నష్టపోతుంటారు.

నివారణ చర్యలు..

పొగాకు లద్దెపురుగు ఎదిగిన లార్వాలను విషపు ఎరను ఉపయోగించి నివారించుకోవాలి. 5 కిలోల తవుడు, 500 మి.లీ. క్లోరోపైరిఫాస్, 500 గ్రాముల బెల్లం మిశ్రమాన్ని తగినంత నీటిలో కలిపి చిన్న గుళికలుగా తయారు చేయాలి. వాటిని పొలంలో కలిసేలా చల్లాలి. ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు పెట్టుకోవాలి. పురుగుల నియంత్రణకు థయోడికార్బ్ ఒక గ్రాము లేదా నొవాల్యురాన్ 0.75 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా ఇండాక్సకార్బ్ 0.8 మి.లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలి.

సాగర్ కాలువలో ట్రాక్టర్ బోల్తా: ఇద్దరి దుర్మరణం


సైదులు


బీమ్‌దేవ్


సాగర్ కాలువలో నుంచి మృతదేహాలను బయటకు తీస్తున్న స్థానికులు

కొణిజర్ల, న్యూస్‌టుడే: కొణిజర్ల మండలం తనికెళ్ల, బోడియా తండా మధ్య సాగర్ కాలువలో ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వైరా శాంతినగర్‌కు చెందిన భూక్యా సైదులు(50), బానోత్ బీమ్‌దేవ్(45)లు రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో బంధువుల ఇంటి వద్ద ఉన్న ఇనుప చువ్వలు తీసుకొని వచ్చేందుకు ట్రాక్టర్‌లో వెళ్లారు. చీకటి పడటంతో బంధువులు ఈ సమయంలో ప్రయాణం వద్దని వారించినా బయల్దేరారు. ఆ క్రమంలో బోడియాతండా సమీపంలోని ప్రధాన సాగర్ కాలువపై ఉన్న వంతెన వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోయి బోల్తా పడింది. స్థానికులు అక్కడకు చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ సాగర్, ఎస్సై సూరజ్‌లు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఆ ఘటనలో సైదులు, బీమ్‌దేవ్ ట్రాక్టర్ ట్రక్కు, ఇంజిన్‌లో ఇరుక్కుపోయారు. వారిని తీసేందుకు స్థానికులు, పోలీసులు జేసీబీ సాయంతో గంటన్నరపాటు శ్రమించారు. విషయం తెలుసుకున్న బంధువులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. తనికెళ్ల, బోడియాతండాకు చెందిన స్థానికులు అధిక సంఖ్యలో అక్కడకు చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. మృతుడు సైదులుకు భార్య అచ్చమ్మ, ముగ్గురు కుమార్తెలున్నారు. బీమ్‌దేవ్‌కు భార్య లక్ష్మి, కూతురు, కుమారుడు ఉన్నారు. సైదులు ఇటీవలే ట్రాక్టర్ కొనుగోలు చేశాడని ఇంతలో ఈ దుర్ఘటన జరిగిందంటూ కుటుంబ సభ్యులు రోదించారు.

32 కుంటల భూమిలో.. ఏడు పంటలతో!

రైతేరాజు

చంద్రుగొండ, న్యూస్‌టుడే

32 కుంటల భూమిలో మునగతోట వేశారు ఆ రైతు.. అందులోనే అంతర్ పంటలుగా వంగ, కాకర, బెండ, టమాటా, నేల చిక్కుడు పంటలను సాగు చేస్తూ ఆయన పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఉపాధి హామీ ద్వారా మునగతోటకు రూ.90 వేలు ఇస్తామని రావికంపాడుకు చెందిన కోటయ్యను అధికారులు ప్రోత్సహించారు. విడతలవారీగా నిధులు అందజేస్తున్నారు. మునగ తోట మధ్య ఖాళీగా ఉన్న భూమిలో కూరగాయ మొక్కలు వేయడంతోపాటు ఎలాంటి రసాయన ఎరువులు వేయకుండా సేంద్రియ విధానంలో వాటిని సాగు చేస్తున్నారు కోటయ్య. చుట్టు ఫెన్సింగ్ తీగలకూ సొరపాదులు అల్లించారు. ప్రస్తుతం టమాటాలు, బెండకాయలు, వంకాయలు కోతకు వచ్చాయి. చిరు వ్యాపారులు తోటవద్దకే వచ్చి కొనుగోలుచేసి తీసుకెళ్తున్నారు. 32 కుంటల్లో కోటయ్య చేస్తున్న సమీకృత వ్యవసాయాన్ని డీఆర్‌డీవో విద్యాచందన ఇటీవల పరిశీలించి అభినందించారు. ఇప్పటి వరకు రూ.లక్షన్నర పెట్టుబడి అయిందని, కూరగాయలతో రూ.50వేల వరకు ఆదాయం పొందినట్లు ఆయన తెలిపారు.


మునగ తోటలో రైతు కోటయ్య

> నేను చేస్తున్న చిరు ప్రయత్నానికి నా కుమారుడు వీరభద్రం, కోడలు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ముగ్గురం కష్టపడి పనిచేస్తున్నాం. ఆదాయం బాగానే ఉంది. ఎలాంటి ఇబ్బంది లేదు. ఇక్కడికే వచ్చి కూరగాయలు కొనుగోలు చేసుకొని వెళ్తున్నారు.
> - కోటయ్య, రావికంపాడు

ప్రశ్న జవాబు

? పెసర వేసి 15 నుంచి 20 రోజులు అవుతుంది. కలుపు నివారణ చర్యలు తెలియజేయండి.
- అల్లూరి నాగేశ్వరరావు, దొడ్డదేవరపాడు

◆ పెసర పైరు విత్తిన 20 రోజుల్లో వెడల్పాకు కలుపు నివారణకు ఇమజిథోఫిర్ 300 మి.లీ. ఎకరాకు లేదా గడ్డిజాతి కలుపు నివారణకు ఎకరాకు 400 మి.లీ. క్విజాలఫాస్ ఇథైల్ లేదా ప్రొపాక్విజాఫాప్ 250 మి.లీ. కలుపు మందులను నేలలో తగు తేమ ఉండేలా చూసుకొని పిచికారి చేసుకోవాలి.

? పెసర, కందిలో పొగాకు లద్దె పురుగు తీవ్రత ఎక్కువ ఉంది. నివారణ మందులు తెలుపగలరు..
- యాస పుల్లయ్య, చింతగుర్తి

◆ పొగాకు లద్దె పురుగు గుడ్ల సముదాయాన్ని నాశనం చేసుకోవాలి. లద్దె పురుగులు కనిపిస్తే క్లోరిపైరిఫాస్ 500 మి.లీ., వేపనూనె ఒక లీటరు కలిపి ఎకరానికి పిచికారి చేసుకోవాలి.

? ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పత్తిలో కాయలు కుళ్లిపోతున్నాయి. సస్యరక్షణ మందులు వివరించాల్సిందే..
- మొదుగు స్వామి, తొర్లపాడు

◆ తేమతో కూడిన వాతావరణంలో తెగులు ఉధృతి పెరుగుతుంది. తీవ్రతబట్టి 15 రోజుల వ్యవధిలో 10 లీటర్ల నీటికి స్ట్రెప్టోసైక్లిన్ లేదా పోషామైసిన్ లేదా ప్లాంటామైసిన్ ఒక గ్రాముతో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేయాలి.
–మధిర, న్యూస్‌టుడే

డాక్టర్ కె.రుక్మిణీదేవి, శాస్త్రవేత్త
మధిర పరిశోధన స్థానం
రైతులు తమ సందేహాలను పంపాల్సిన వాట్సప్ నెంబరు:
76750 50041

నత్తల బెడద నివారణ ఇలా..!


మిరప మొక్క కాండాన్ని ఆశించిన నత్త..

మిరప తోటల్లో ఈ ఏడాది నత్తల బెడద అధికమైంది. నత్తలు మొక్కల కాండంపై ఆశించి గోకి తింటుండటంతో ఆ భాగంలో కాండం కుళ్లిపోయి మొక్కలు వడలిపోతున్నాయి. కొన్నాళ్లకు ఎండిపోతున్నాయి. మిరప క్షేత్రాల్లో ఎక్కువ సంఖ్యలో ఇవి ఆశిస్తుండటంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. కొందరు నత్తలను కూలీల చేత ఏరించి నివారించుకుంటుండగా, ఇంకొందరు వివిధ రకాల పురుగు మందులను పిచికారి చేస్తున్నారు. నత్తల నివారణ విధానాన్ని కూసుమంచి ఏవో రామదుగు వాణి వివరించారు. నత్తలు నష్టపరుస్తున్న తోటల్లో మెటాల్డిహైడ్ 2.5శాతం గుళికలు ఒక చదరపు మీటరుకు ఐదు గ్రాముల చొప్పున వాడుకోవడం ద్వారా వీటిని నివారించుకునే అవకాశం ఉందన్నారు. మొనోక్రోటోఫాస్ పురుగు మందులో బియ్యం నానబెట్టి మొక్కల వద్ద చల్లుకోవడం ద్వారా ఆశించిన ప్రయోజనం ఉంటుందన్నారు.
- కూసుమంచి, న్యూస్‌టుడే

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

ఖమ్మం నేరవిభాగం, జవహర్‌నగర్, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలోని పాకబండబజార్‌కు చెందిన పవన్ కళ్యాణ్(25) మద్యానికి బానిసగా మారాడు. రెండేళ్ల క్రితం దమ్మాయిగూడెం పరిధిలోని గుడ్ వే పునరావాస కేంద్రంలో అతడిని చేర్పించారు. చికిత్స అనంతరం కొద్దిగా కోలుకోవటంతో పవన్‌ను కుటుంబ సభ్యులు తిరిగి ఇంటికి తీసుకెళ్లారు. 20 రోజుల క్రితం తిరిగి మద్యానికి బానిసగా మారడంతో మరోసారి కేంద్రానికి తీసుకొచ్చి వదిలివెళ్లారు. నాలుగు రోజులకే పవన్ తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయాడు. ఈ నెల 17న తల్లిదండ్రులు పవన్‌ను తిరిగి కేంద్రానికి తీసుకొచ్చి అప్పగించారు. అప్పటి నుంచి సరిగా భోజనం చేయడం లేదని ఆ కేంద్రం సభ్యులు అతడిని కొట్టారు. ఈక్రమంలో సోమవారం అపస్మారక స్థితికి చేరుకున్న పవన్‌ను నిర్వాహకులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందాడు. యువకుడి కుటుంబ సభ్యులు చికిత్స కేంద్రం నిర్వాహకుల దాడిలో తమ కుమారుడు మృతిచెందాడని ఆందోళన చేశారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

మానని గాయాలు



ఆగస్టు నెల చివరిలో విరుచుకపడిన భారీ వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. మొక్కలు కొట్టుకుపోవడంతోపాటు పొలాల్లో ఇసుక, రాళ్లు మేటవేశాయి. కొందరు రైతులు మేటలు తొలగించి సాగును కొనసాగిస్తే మరికొందరు అలానే వదిలేశారు. మోరంపల్లిబంజర సమీపంలోని దోమలవాగు వద్ద ఇసుక మేటలు వేసిన పొలాన్ని 'న్యూస్‌టుడే' ఛాయాగ్రాహకంలో బంధించింది.– బూర్గంపాడు, న్యూస్‌టుడే

లాభసాటి పంటలపై దృష్టి సారించాలి: మంత్రి తుమ్మల


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు సంప్రదాయ పంటలపై కాకుండా లాభసాటి సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. గుర్రాలపాడులో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ వాతావరణ సమస్యలతో తేమ సమస్య అధికంగా ఉందని, రైతులు ఓపిగ్గా ఆరబెట్టి తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు. అధిక వర్షాల ప్రభావం దృష్ట్యా ప్రభుత్వం సీసీఐని అప్రమత్తం చేస్తూ రాష్ట్రంలో 44 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పండిన పత్తి పంటను పూర్తిస్థాయిలో మద్దతు ధరకు కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. రైతులు లాభసాటి ఆయిల్‌పామ్ సాగు దిశగా దృష్టి సారించాలని సూచించారు. సోయాబీన్, పెసర, కందులు, మొక్కజొన్న కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మార్కెటింగ్ శాఖ రూపొందించిన కరపత్రాన్ని మంత్రి ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ శ్రీజ, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మద్దులపల్లి మార్కెట్ ఛైర్మన్ బైరు హరినాథబాబు, ఆర్డీఓ గణేశ్, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి ఎంఏ ఆలీం, మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

దమ్మపేట, వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: సేంద్రియ వ్యవసాయంతో రైతులకు సంతృప్తికర లాభాలు వస్తున్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు రైతునేస్తం ఫౌండేషన్‌ను సోమవారం సందర్శించారు.

ఫైవ్‌స్టార్ రేటింగ్ అవార్డు అందుకున్న జీఎం

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు సింగరేణి జేకే 5 ఉపరితల గనుల పని ఆధారంగా వచ్చిన 'ఫైవ్ స్టార్ రేటింగ్' అవార్డు, ప్రశంసాపత్రాన్ని సోమవారం దిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా సింగరేణి సీఎండీ ఎన్.బలరాం, డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డితో కలిసి ఇల్లెందు జీఎం జాన్‌ఆనంద్ అందుకున్నారు. బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ ఓసీల్లో పర్యావరణం పరిరక్షణకు పాటుబడుతూ, రక్షణ చర్యలను ప్రామాణికంగా తీసుకుని రేటింగ్‌లను ప్రకటిస్తోంది. విశిష్టలతో ఉత్పత్తిలో రికార్డులను సృష్టించిన జేకే5 ఉపరితల గనికి 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 'ఉపరితల గనుల' విభాగంలో అరుదైన గుర్తింపు రావడంపై ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నుంచి సింగరేణి సీఎండీ ఎన్.బలరాం, డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డితో కలిసి అవార్డు అందుకుంటున్న జీఎం జాన్ ఆనంద్

ముత్తంగి రూపంలో రాములోరి దర్శనం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారు సోమవారం ముత్తంగి రూపంలో దర్శనమిచ్చారు. ముత్యాలతో పొదిగిన వస్త్రాలంకృతుడైన రామయ్య తండ్రి చూడముచ్చటగా కనిపించారు. అర్చకులు భక్తిశ్రద్ధలతో సుప్రభాతం పలికి ఆరాధించి నామార్చన చేశారు. క్షేత్ర విశిష్టతను ప్రవచించారు. నిత్య కల్యాణంలో భాగంగా మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక నిర్వహించారు. దర్బారు సేవను ఘనంగా సాగింది. గుంటూరుకు చెందిన భాష్యం లక్ష్మీప్రసన్న, రామకృష్ణ దంపతులు రాములవారిని దర్శించుకుని మొక్కులో భాగంగా అన్నదానం నిమిత్తం రూ.లక్ష విరాళాన్ని ఈఓ రమాదేవికి అందించారు. వైదిక పెద్దలు ఆశీర్వచనం అందించారు.

జాతర ఆదాయం రూ.27.17 లక్షలు

కారేపల్లి, న్యూస్‌టుడే: కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో శ్రీకోటమైసమ్మ జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీల లెక్కింపు రెండో దఫా సోమవారం పూర్తయింది. ఈ ఏడాది మొత్తంగా దుకాణ వేలం, పూజా టికెట్ల విక్రయం కలుపుకొని రూ.27,17,949 ఆదాయం వచ్చినట్లు ఈవో వేణుగోపాలచార్యులు పేర్కొన్నారు. గత ఏడాదికంటే రూ.91,212 ఆదాయం పెరిగిందన్నారు. ఛైర్మన్ పర్సా పట్టాభి రామారావు పాల్గొన్నారు.

విద్యతోనే నిజమైన ప్రగతి: ఐటీడీఏ పీఓ


ఎంబీబీఎస్ విద్యార్థినికి చెక్కు అందిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం, న్యూస్‌టుడే: విద్యతోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, విద్యార్థులను అన్ని అంశాలలో తీర్చిదిద్దాలని ఐటీడీఏ పీఓ రాహుల్ ఆదేశించారు. క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఐటీడీఏలో సోమవారం దర్బారు నిర్వహించి వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పంపారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను సకాలంలో చేరవేసి వారి ప్రగతికి కృషిచేయాలని సూచించారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పట్టాలో పేర్లను మార్చాలని, వ్యవసాయ అవసరాలను తీర్చాలని పలువురు దరఖాస్తులు అందించడంతో వీటిని ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఆదేశించారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించాలని వినతులు అందాయి. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఎస్డీసీ రవీంద్రనాథ్, విభాగాల అధికారులు పాల్గొన్నారు.

★ విద్యార్థినులకు చేయూత: ఏన్కూర్ మండలం రేపల్లెవాడ గ్రామానికి చెందిన భూక్యా శ్రీవిద్య నీట్ పరీక్ష రాసి ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఆమెను ప్రోత్సహించేందుకు రూ.50 వేల చెక్కును పీఓ కార్యాలయంలో అందించారు. దుమ్ముగూడెం మండలం కొత్త మారేడుబాక గ్రామానికి చెందిన బుద్దుల కవిత ఐసెట్ పరీక్ష రాసి ఉత్తమ ర్యాంకు సాధించడంతో ఎంబీఏ సీటు పొందింది. ఆమె ఉన్నత చదువుకు రూ.30 వేల చెక్కును పీఓ తన కార్యాలయంలో అందించారు.

'శాస్త్రీయ విద్యా సాధనకు పోరాటం'



ఖమ్మం నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ పూర్వ, ప్రస్తుత నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: దోపిడీ, పీడన లేని సమ సమాజం కోసం, శాస్త్రీయ విద్యా సాధనకు పీడీఎస్‌యూ సుదీర్ఘ కాలంగా పోరాడుతోందని వక్తలు పేర్కొన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అనుబంధ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) 50 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అర్ధ శతాబ్ద ఉత్సవ సభ నిర్వహించారు. తొలుత ఖమ్మం పెవిలియన్ మైదానం అమరవీరుల స్మారక స్తూపం నుంచి వందలాది మంది విద్యార్థులు, పీడీఎస్‌యూ పూర్వ, ప్రస్తుత నాయకులతో ప్రారంభమైన ప్రదర్శన రిక్కాబజార్ ప్రభుత్వ పాఠశాల వరకు కొనసాగింది. అనంతరం బహిరంగ సభలో వక్తలు మాట్లాడుతూ.. 1972లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జార్జిరెడ్డి నాయకత్వంలో ఏర్పడిన పీడీఎస్‌యూ విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. అరుణోదయ కళాకారుల నృత్యాలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు, జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్, పూర్వ విద్యార్థులు సారంగపాణి, లక్ష్మీనారాయణ, ప్రస్తుత ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.క్రాంతి, జి.మస్తాన్, రాజేశ్, ప్రణయ్ పాల్గొన్నారు.

వీధుల్లో భిక్షాటనపై చర్యలు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: వీధుల్లో బాలలను ఎత్తుకొని భిక్షాటన చేస్తున్న వారిపై కలెక్టర్ ఆదేశాలతో జిల్లా మహిళా సంక్షేమాధికారిణి స్వర్ణలత లెనినా ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. బాలల పరిరక్షణ విభాగం, బాలల సంక్షేమ సమితి సభ్యులు, బాలల హెల్ప్‌లైన్ విభాగాల వారు ప్రత్యేక డ్రైవ్‌లో పాల్గొన్నారు. భద్రాచలం బస్టాండు, రామాలయం, ప్రధాన రహదారిలోని హోటళ్లు, పర్ణశాల ఆలయం వద్ద భిక్షాటన చేస్తున్న అయిదుగురు బాలలను, తమ బిడ్డలతో భిక్షాటన చేస్తున్న మరో తొమ్మిది మంది మహిళలను గుర్తించి శిశుగృహకు తరలించారు. నిబంధనల మేరకు ఐదుగురు బాలలను వసతిగృహానికి తరలించారు. మహిళలతో పాటు ఉన్న 9 మంది బాలలను శిశుగృహలో ఉంచారు. వారి తల్లులను ఆధార్‌కార్డులతో మంగళవారం రమ్మని పంపారు. అనాదిగా భిక్షాటనే తమవృత్తి అని ఆ మహిళలు పేర్కొనడం గమనార్హం. ప్రత్యేక డ్రైవ్‌లో హరికుమారి, అంబేడ్కర్, శేషయ్య, లత, ధరణి, వినోద్, సందీప్ తదితర బృంద సభ్యులు పాల్గొన్నారు.

దుబయ్‌లో డెలివరీ బాయ్స్ ఉద్యోగాలు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: టామ్‌కామ్ కింద దుబయ్‌లో డెలివరీ బాయ్స్ ఉద్యోగాలు చేసేందుకు అర్హులైన తెలంగాణ యువకులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి మాధవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 40 ఏళ్ల వయస్సు, మూడేళ్ల టూవీలర్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు అర్హులన్నారు. ఈ నెల 24న ప్రభుత్వ ఐటీఐ(టేకులపల్లి)లో నిర్వహించే ముఖాముఖి అవసరమైన పత్రాలు తీసుకొని రావాలని సూచించారు. వివరాలకు నం.94400 49861, 94400 50951 సంప్రదించాలని సూచించారు.

చక్కటీ ఆలోచన

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే, ఈనాడు, ఖమ్మం

మహిళా స్వావలంబనకు ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను సద్వినియోగం చేసుకొని ఎదుగుతున్నారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మహిళా సంఘాల కోసం వినూత్న ఆలోచన చేశారు. మహిళా శక్తి పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలతో 'స్త్రీ టీ స్టాల్'లు ఏర్పాటు చేయించనున్నారు. డీఆర్డీఏ అధికారులు ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గ కేంద్రంలో మహిళలకు క్యాంటీన్ల నిర్వహణ బాధ్యత అప్పగించాలని ఆదేశించింది. మరో వైపు 'స్త్రీ టీ స్టాల్స్' సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని హైవే రహదారులు, ప్రధాన రహదారుల వెంట, పట్టణ, మండల కేంద్రాల్లో రద్దీ కూడళ్లు, టైర్ పంక్చర్ దుకాణాల వద్ద, అన్ని మండల, డివిజన్ కేంద్రాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలతో 'స్త్రీ టీ స్టాల్స్' ఏర్పాటు చేయనున్నారు. స్టాల్స్ నమూనాలు కలెక్టరేట్ ఆవరణలో రూపొందిస్తున్నారు. కలెక్టరేట్ వద్ద నిర్మించిన ఆర్టీసీ బస్‌షెల్టర్‌కు అనుసంధానంగా ప్రత్యేకంగా ఇందిర మహిళ టీ స్టాల్ నిర్మించారు. కలెక్టరేట్‌లోని క్యాంటీన్ నిర్వహణ బాధ్యతను వి.వెంకటాయపాలెంలోని మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించనున్నారు. జిల్లా మహిళా సమాఖ్య, మండల కేంద్రాల్లో మండల మహిళా సమాఖ్యలు, ఆయా గ్రామాల్లో గ్రామంలోని మహిళా స్వయం సహాయక సంఘాల వారికి టీ స్టాల్స్ నిర్వహణ అప్పగిస్తారు. పోటీ లేకుండా ఆయా గ్రామాల్లోని మహిళలకే వాటిని కేటాయించనున్నట్లు అధికారులు చెపుతున్నారు.



స్త్రీ టీ స్టాల్ నమూనాలను సిద్ధం చేస్తున్నారిలా

☛ ఖమ్మంలో మాత్రం కొత్త కలెక్టరేట్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో క్యాంటీన్ ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెప్మా ద్వారా మహిళా సంఘాలకు క్యాంటీన్ ఇవ్వనున్నారు.

☛ వైరా, మధిర, సత్తుపల్లి, కూసుమంచి (పాలేరు)లో మండల మహిళా సమాఖ్యల ద్వారా క్యాంటీన్‌లు మహిళా సంఘాలకు కేటాయిస్తారు.

పిడుగుపాటుతో రైతు మృత్యువాత


సంగెపు నారాయణ

బోనకల్లు, న్యూస్‌టుడే: పిడుగు పడి ఓ రైతు మృతి చెందిన ఘటన బోనకల్లు మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సంగెపు నారాయణ(55) సాయంత్రం తన పత్తి చేలో పాటు పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఉరుములు మెరుపులు వచ్చాయి. అదే సమయంలో సమీపంలో పిడుగుపడి అక్కడికక్కడే చనిపోయాడు. రాత్రి 8గంటల సమయంలో అరక ఎద్దులు ఇంటికి రావటంతో నారాయణ వెనక వస్తున్నాడని కుటుంబ సభ్యులు భావించారు. ఎంతసేపటికీ రాకపోవడంతో రాత్రి 10 గంటల సమయంలో కుటుంబ సభ్యులు వెతుక్కుంటూ పొలానికి వెళ్లగా ఒంటిపై కాలిన గాయాలతో విగత జీవిగా పడి ఉన్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై మధుబాబు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి..

పినపాక, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి మరో ద్విచక్ర వాహనాన్ని వెనకనుంచి ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. సీతారాంపురంలో సోమవారం రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మణుగూరు మండలం కొండాయిగూడెం గ్రామానికి చెందిన ప్రవీణ్(26) తన బైక్‌పై ఏడూళ్లబయ్యారం వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు.

కానిస్టేబుల్ ఇంట్లో దొంగతనం

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: ఓ కానిస్టేబుల్ కుటుంబం ఇంట్లో దొంగతనం స్థానిక ఎన్నెస్పీ క్యాంపులో నివసించే హేమతేజ్ అశ్వాపురంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. తన కుమారుడి పుట్టు వెంట్రుకలు తీయించేందుకు శనివారం అన్నవరం బయలుదేరి వెళ్లారు. నగరంలోని టేకులపల్లిలో నివసించే తన సోదరి జయసుధ వారితో వెళ్లారు. ఆమె తన 16 తులాల బంగారు నగలను వీరి ఇంటి బీరువాలో పెట్టారు. అన్నవరం నుంచి ఆదివారం రాత్రి తిరిగి వచ్చిన వారు ఇంట్లో గుర్తుతెలియని దుండగులు నగలతోపాటు, రూ.50 వేలు నగదు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. జయసుధ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

రూ.56 లక్షలకు వస్త్ర వ్యాపారి ఐపీ

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: కూసుమంచి మండలం కోక్యాతండాకు చెందిన పిల్లి శ్రీలక్ష్మి రూ.56 లక్షలకు ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం ఐపీ దాఖలు చేశారు. కేసులో మొత్తం ఏడుగురు రుణదాతలను ప్రతివాదులుగా చేర్చారు. ఏడేళ్లుగా వస్త్ర వ్యాపారం చేస్తున్న పిటిషనర్ శ్రీలక్ష్మి.. వ్యాపారాభివృద్ధి కోసం ప్రతివాదుల వద్ద అప్పులు తీసుకున్నారు. కొవిడ్ తదితర కారణాలతో వ్యాపారంలో నష్టాలు వచ్చాయని, రుణదాతలకు బాకీలు చెల్లించే పరిస్థితి లేనందున తనను దివాలాదారుగా ప్రకటించాలని కోర్టులో ఐపీ దాఖలు చేశారు.

ముగిసిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

సుబేదారి(హనుమకొండ), న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో అంతర్ కళాశాలల క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. విజేతలకు సుబేదారి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ సుంకరి జ్యోతి బహుమతులు, షీల్డులు అందజేశారు. కబడ్డీలో సుబేదారి ఆర్ట్స్ కళాశాల జట్టు విజేతగా నిలిస్తే ఖమ్మంలోని యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల జట్టు ద్వితీయ స్థానం సంపాదించింది. ఖోఖోలో హనుమకొండ కేడీసీ జట్టు విజేతగా నిలిస్తే ఖమ్మంలోని యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది.

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్త పత్తి	5,500	7,000	6,700
పెసలు	4,960	7,200	6,800
ఏసీ ఎండుమిరప	10,200	19,000	16,500
ఎండుమిరప	9,000	16,500	15,600
ఏసీతాలుమిరప	9,000	9,200	9,100
తాలుమిరప	8,000	9,400	9,000

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట


అశ్వారావుపేటలో కొవ్వొత్తులతో పోలీసులు, విద్యార్థుల ప్రదర్శన

పోలీసు అమరవీరులకు నివాళి

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని అశ్వారావుపేటలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తులను వెలిగించి పట్టణంలోని ప్రధాన వీధుల్లో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు యయాతిరాజు, శివరామకృష్ణ, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మీసేవ ఛార్జీలు వసూలు చేయాలని అంతకుమించి వసూలు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం.అశోక్‌కుమార్ హెచ్చరించారు. మీసేవ నిర్వాహకులతో రెవెన్యూ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. వివిధ ధ్రువీకరణ పత్రాల అప్‌లోడ్, చెల్లించాల్సిన ఫీజులు తదితర సమస్యలపై సమీక్షించారు.

మేముున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) భద్రాచలం: 79950 67029 అశ్వారావుపేట: 80085 73696 పినపాక: 91212 29033

సమస్య: మారుమూల గ్రామమైన కుర్నపల్లిలో కొంత కాలంగా మరమ్మతులకు గురైన తాగునీటి బోరును పట్టించుకోవడంలేదు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. తాగు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. మూడు చోట్ల మంచినీటి బోర్ల పంపులు పనిచేయడం లేదు.

- కుర్నపల్లి గ్రామస్థులు

సమాధానం: బోరు మెటీరియల్ సిద్ధంగా ఉంది. ఫ్లషింగ్ చేయాలి. చేతి పంపుల మరమ్మతులు పూర్తి చేయిస్తాం.
- సైదులునాయక్, పంచాయతీ కార్యదర్శి - చర్ల, న్యూస్‌టుడే

అశ్వారావుపేట శివారు శ్రీరంగాపురం వద్ద విజయదుర్గా భవాని గుడి నుంచి ఆల్లిగూడెం వెళ్లే మార్గంలో కల్వర్టు సమీపంలో తాగునీటి

పైపు పెద్దఎత్తున లీకై కాలువలా నీరు ప్రవహిస్తోంది. ఇళ్లల్లోకి సక్రమంగా నీరు రావడం లేదు. లీకేజీని అరికట్టాలి.
- రామకృష్ణ, శ్రీరంగాపురం

✔ వెంటనే మరమ్మతులు చేయించి లీకేజీని అరికడతాము. - రమేష్, పంచాయతీ కార్యదర్శి, నారాయణపురం కాలనీ - అశ్వారావుపేట, న్యూస్‌టుడే

సింగరేణిలో కార్మిక చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలి


పీకేఓసీ ఉత్పత్తి వివరాలను పరిశీలిస్తున్న బృందాకారాట్

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సింగరేణి సంస్థలో కార్మిక చట్టాలను అత్యంత పటిష్ఠంగా అమలు చేయాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారాట్ అన్నారు. మణుగూరులోని ఉపరితల గనులతోపాటు ఓబీ కంపెనీలను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గనులు, ఓబీ కంపెనీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులతోపాటు నిర్వాసిత గ్రామమైన కొత్తకొండాపురం ప్రజలను నేరుగా కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ఉపరితల గనుల కారణంగా వేలాది ఎకరాల వ్యవసాయ, అటవీ భూములు ధ్వంసమైనాయని, 1991 తర్వాత ప్రైవేటీకరణ వేగం పెరిగిందన్నారు. సింగరేణి సంస్థలో స్థానికంగా భూములిచ్చి నిర్వాసితులైన వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఉద్యోగాలు రాక అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. స్థానికంగా ఉన్న అన్ని ఓబీ కంపెనీల్లో సుమారు 80 శాతం వరకు గుజరాత్‌కు చెందిన కంపెనీలు మాత్రమే పని చేస్తున్నాయని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పని చేస్తున్న వారికి సరైన సౌకర్యాలు లేవన్నారు. అధిక పని గంటలు, ఒత్తిడి కారణంగా కార్మికులందరూ అనారోగ్యాలకు గురై ఆందోళన చెందుతున్నారన్నారు. కొత్తకొండాపురం మూడుసార్లు నిర్వాసిత గ్రామంగా మారినా వారికి ఎటువంటి న్యాయం జరుగలేదన్నారు. నిర్వాసితులందరికీ పీవీ అంద ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, ఎస్‌ఎఫ్‌బ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు, సీపీఎం నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నేళ్లయినా రైతుబజారు రాదాయే..!


అశ్వారావుపేట బస్టాండు కూడలిలోని కూరగాయల మార్కెట్

నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలో ఏళ్ల గడుస్తున్నా రైతుబజారు ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. రైతుబజారు లేకపోవడం, కూరగాయల మార్కెట్ లేక కూరగాయల రైతులు వినియోగదారులు అధికధరలు చెల్లించాల్సి వస్తోంది. దీంతో దళారుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. దశాబ్ద కాలంగా అశ్వారావుపేటలో రైతుబజారు ఏర్పాటు కల నెరవేరకుండానే ఉంది. రైతుబజారు లేకపోవడంతో కూరగాయలు విక్రయించుకునేందుకు రైతులకు ఒక ప్రదేశం లేకుండాపోయింది. పండించిన కూరగాయలు ఎక్కడ విక్రయించుకోవాలో అర్థంకాక దళారులకే అమ్ముకోవాల్సి వస్తోంది. దీంతో పండించిన రైతుకు కనాకష్టంగా సాగు ఖర్చులు వస్తున్నాయే గాని లాభాలు ఉండని దుస్థితి నెలకొంది. ఉదాహరణకు రైతు నుంచి హోల్‌సేల్ దుకాణదారులు కేజీ బెండ కాయలు రూ.20కి కొంటే మార్కెట్‌లో దుకాణదారు రూ.50 వరకు అమ్ముతున్నాడంటే పరిస్థితి అర్థంచేసుకోవచ్చు. పోనీ రైతుకు వెంటనే సొమ్ములు ఇస్తున్నారా అంటే అదీ లేదు.. రెండు రోజులకు ఇస్తుంటారు. అంటే రిటైల్ దుకాణదారులు విక్రయించాకే రైతులకు సొమ్ములు చెల్లించే పరిస్థితి ఉంది.

✦ అదే రైతుబజారు ఉంటే నేరుగా రైతులు తాము పండించిన కూరగాయలను రిటైల్ లేదా హోల్‌సేల్‌కి విక్రయించుకునే సౌకర్యం ఉంటుంది. ఏఎంసీ(వ్యవసాయ మార్కెట్ కమిటీ) ఆధ్వర్యంలో రైతుబజారు ఏర్పాటు చేయాలని చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ప్రభుత్వం స్థలం కేటాయిస్తే ఒక్కో రైతుబజారు ఏర్పాటుకు రూ.5లక్షలు ప్రభుత్వం ఖర్చు చేసేందుకు ప్రతిపాదనలు ఇచ్చింది. దీంతో

✦ భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం మినహా మరెక్కడా రైతుబజారు లేదు. మణుగూరు, ఇల్లెందులో నిర్మించిన రైతుబజార్లు నేటికీ ప్రారంభం కాలేదు. అశ్వారావుపేట, భద్రాచలంలో అసలు నిర్మాణాలే లేవు. గతంలో సెర్ప్ ద్వారా రైతుబజార్లు ఏర్పాటు చేయించాలని ప్రయత్నించినా అది ఫలించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుబజారు ఏర్పాటుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అశ్వారావుపేట, న్యూస్‌టుడే

గోదావరి లోతు, వరద ప్రవాహంపై అధికారుల అంచనా

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం స్నానఘట్టాల వద్ద గోదావరి నది లోతు, వరద ప్రవాహాన్ని నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం అంచనా వేశారు. 'స్నానఘట్టాల వద్ద భక్తులకు రక్షణేదీ..?' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. స్పందించిన అధికారులు జేఈ వెంకటేశ్, సిబ్బంది స్నానఘట్టాల వద్ద పరిశీలించారు. ఈ ఏడాది భారీ వరదలకు నదిలో వరద ప్రవాహంతో స్నానఘట్టం ప్రాంతంలో కోతకు గురైనట్టు అంచనా వేశారు. దీంతో ఇక్కడ సహజంగా ఇక్కడ ఉండాల్సిన లోతు కంటే ఎక్కువ ఉన్నట్టు గుర్తించారు. నది అధిక కోతకు గురై ప్రస్తుతం సుమారు 15 అడుగుల లోతు పైగా ఉన్నట్టు తేల్చారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు.

ఈనాడు కథనానికి స్పందన

మొడెం వంశీకి ఎమ్మెల్యే తెల్లం అభినందన



భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భారతదేశం తరఫున పాల్గొని బంగారు పతకాలు సాధించిన మొడెం వంశీని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సోమవారం అభినందించారు. వంశీ యూరప్‌లోని మాల్టా, సౌత్ ఆఫ్రికాలో సస్ సిటీలో జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బహుమతులు పొందిన సంగతి తెలిసిందే. వంశీకి చేయూతనిచ్చిన స్థానిక జిమ్ నిర్వాహకుడు రామిరెడ్డిని, శ్రీనివాసరెడ్డి, శివరామకృష్ణ, కృష్ణాజీలను అభినందించారు.

గిరిజన మహిళా ఏఎన్ఎం కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం గిరిజన మహిళా ఏఎన్ఎం పాఠశాలలో చేరేందుకు ఉండే ఎంపీహెచ్‌డబ్ల్యూ (మహిళ) కోర్సులో అర్హులైన వారు చేరాలని ఐటీడీఏ పీఓ రాహుల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26 వరకు దరఖాస్తులను స్థానిక ఎఎన్ఎంహెచ్‌డబ్ల్యూ శిక్షణ పాఠశాలలో అందించాలని సూచించారు. ఇంటర్మీడియట్‌లోని ఏ గ్రూపు వారైనా 17 సంవత్సరాలు నుంచి ఆపై వయస్సున్న గిరిజన మహిళా అభ్యర్థులు ఇందుకు అర్హులని వివరించారు.

ఎన్పీడీసీఎల్ అశ్వారావుపేట ఏఈగా రవి

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్ అశ్వారావుపేట సెక్షన్ ఏఈగా రవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నాగుపల్లి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చి 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం సెక్షన్ బాధ్యతలు స్వీకరించారు. అశ్వారావుపేట సెక్షన్ ఏఈ మేలో ఏసీబీ దాడుల్లో పట్టుబడగా అనాటి నుంచి పోస్టు ఖాళీగా ఉంది.

అశ్వాపురంలో భారీ వర్షం

అశ్వాపురం, న్యూస్‌టుడే: అశ్వాపురం మండలవ్యాప్తంగా సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఇంతకాలం తీవ్ర ఎండ, వేడిమితో సతమతమవుతున్న ప్రజలకు ఈ వర్షం ఎంతో ఉపశమనాన్ని కలిగించింది. సాగునీటి కోసం కటకటలాడుతున్న రైతులకూ ఈ వర్షం ఎంతో మేలు చేసింది.

వర్షానికి కూలిన ఇందిరమ్మ ఇల్లు


కూలిన ఇంటి వద్ద వెంకమ్మ

దమ్మపేట, న్యూస్‌టుడే: మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి మారప్పగూడెనికి చెందిన కాల్సు వెంకమ్మకు చెందిన ఇందిరమ్మ ఇల్లు కుప్పకూలింది. ప్రమాదాన్ని ముందుగా పసిగట్టిన కుటుంబ సభ్యులు భయంతో బయటకు పరిగెత్తడంతో ప్రాణాలు దక్కించుకున్నారు. ఇంట్లోని వస్తువులన్నీ దెబ్బతిన్నాయి.

పేదల సమస్యల పరిష్కారానికి పోరాటం

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: పేదల సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి పుల్లారెడ్డి పేర్కొన్నారు. మణుగూరులోని శివలింగాపురంలో ఆదివారం రాత్రి నిర్వహించిన శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ శత జయంతి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించుకోవాలన్నారు. అనంతరం గ్రామ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు సీతారాములు, వెంకటేశ్వర్లు, కృష్ణ, మురళీ, రాయలింగు తదితరులు పాల్గొన్నారు.

రచయిత్రి లలితకు పురస్కారం

భద్రాచలం పట్టణం: భద్రాచలానికి చెందిన ప్రముఖ రచయిత్రి, శ్రీశ్రీ కళావేదిక జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టి లలితకు కళాసేవా పురస్కారం లభించింది. ఏపీలోని తాడేపల్లిగూడెనికి చెందిన బీఎల్ కళావేదిక సాహితీ సంస్థ వారు ఈ పురస్కారాన్ని ఆదివారం అందించినట్లు ఆమె తెలిపారు.

బాలవెలుగు పాఠశాలకు నిత్యావసరాల పంపిణీ

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరు ఏరియాలో ఓబీ పనులు నిర్వహిస్తున్న దుర్గ కంపెనీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవిద్యా బ్యాస్(బాలవెలుగు) పాఠశాలకు సోమవారం నిత్యావసర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ రాంబాబు మాట్లాడుతూ.. పేద విద్యార్థులను ఆదుకునేందుకు ముందుకువచ్చిన దుర్గ కంపెనీ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. పీకేఓసీ రక్షణ అధికారి లింగబాబు, దుర్గ కంపెనీ మేనేజర్ బిపిన్, పాఠశాల నిర్వాహకుడు జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శవ పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించాలని ఆందోళన

చర్ల, న్యూస్‌టుడే: చర్ల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన శవపరీక్ష కేంద్రం భవనాన్ని తక్షణమే ప్రారంభించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. పార్టీ ప్రాంతీయ నాయకుడు కొండా చరణ్ మాట్లాడుతూ ఏవరైనా మృతిచెందితే పోస్టుమార్టం కోసం భద్రాచలం తీసుకెళ్లాలంటే పేదలకు ఎంతో ఇబ్బంది ఎదురౌతోందన్నారు. కొండా కౌశిక్, చెన్నం మోహన్, నరసింహ, రేగ ఆదెయ్య, నాగమణి, సుశీల, నరసింహారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణదారుకు నోటీసు


అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అందులో షెడ్డు నిర్మాణం చేయిస్తున్న వ్యక్తికి సోమవారం అధికారులు నోటీసు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి మేడిపల్లి సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయకపురంలో ప్రభుత్వ స్థలంలో గతంలో ఉన్న తాగునీటి పథకం ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉండటంతో దాన్ని రెండేళ్ల క్రితం కూల్చివేశారు. ఆ స్థలం తమదేనంటూ గ్రామానికి చెందిన ఉప్పల బ్రహ్మేంద్రరావు దాన్ని ఆక్రమించి షెడ్డు నిర్మాణాన్ని చేపట్టడంతో ఆయనకు నోటీసు ఇవ్వడంతో పాటు ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

భూమికి పచ్చాని రంగేసినట్టు..!



చండ్రుగొండ మండలం దామరచర్ల గ్రామంలో కంటికి కన్నింపేంత దూరం వరకు పచ్చని పంటపొలాలు కనువిందు చేస్తున్నాయి. ఇలా దర్శనమిస్తున్నాయి. భూమికి నిజంగా పచ్చని రంగేశారా అన్నట్లు పంట పొలాలు కన్పిస్తుండటాన్ని 'న్యూస్‌టుడే' చాయాగ్రాహకుడు బంధించింది.
- చండ్రుగొండ, న్యూస్‌టుడే

పొంచిఉన్న ప్రమాదం



మణుగూరులోని సమితిసింగారం ప్రధాన రహదారిపై పక్కన ఉన్న వృక్షం ఎండిపోయి విరిగడానికి సిద్ధంగా ఉంది. ఈ రహదారిపై రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. ఇదే రహదారిపై గత ఏడాది ఒక ఎండిన వృక్షం కిందపడింది. ఆ సమయంలో ఒక కారు, ఆటో ధ్వంసం అయ్యాయి. ప్రమాదవశాత్తు ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. మళ్లీ అదే పరిస్థితి దాపురించింది. ఈ విషయంపై మణుగూరు అటవీశాఖ అధికారి ఉపేంద్ర మాట్లాడుతూ త్వరలో తగు చర్యలు తీసుకుంటామన్నారు.- మణుగూరు, న్యూస్‌టుడే

మునగ సాగుపై అవగాహన

పినపాక, న్యూస్‌టుడే: రైతులు అతితక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించేందుకు మునగ పంటను సాగు చేయాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. ఏడూళ్లబయ్యారంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీవో వెంకటేశ్వరరావు, కార్యదర్శి జైపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏటీసీ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏటీసీ కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలని లేబర్ అధికారి బీవీఎన్ రాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అత్యాధునిక సాంకేతికతతో నిర్మిస్తున్న ఏటీసీలో ఆరు కోర్సులు అందుబాటులో ఉన్నాయని, యువతకు మెరుగైన ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అత్యధిక కోర్సులతో కూడిన ఏటీసీలను నెలకొల్పుతుందన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ప్రవేశాలు కొనసాగుతున్నాయని, పదో తరగతి పూర్తయిన వారు ఆన్‌లైన్ ద్వారా నచ్చిన కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చన్నారు.

ఆడపడుచులకు చీరల పంపిణీ: ఎమ్మెల్యే

దమ్మపేట, న్యూస్‌టుడే: దసరా, దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్రంలోని ఆడపడుచులకు ఐదరికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చీరలు పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు. మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం తరఫున నియోజకవర్గ వ్యాప్తంగా మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మహిళలందరూ సంతోషంగా పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. తహసీల్దార్ సీహెచ్ నరేశ్, ఎంపీడీవో రవీంద్రరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సత్యప్రసాద్, నాగప్రసాద్, శ్రీను, వసంతరావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని దమ్మపేట, మందలపల్లి, మల్కారం, పట్వారిగూడెం, అంకంపాలెం, ముద్దులగూడెం సహా పలు పంచాయతీల్లో సీఎం సహాయనిధి, కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం అందజేశారు.

చండ్రుగొండ: మండలంలోని పలు పంచాయతీల్లో సోమవారం బతుకమ్మ చీరల పంపిణీ ప్రారంభ


మహిళలకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

మైంది. ఈ చీరలు కేవలం స్వయం సహాయక సంఘం సభ్యులకే పంపిణీ చేస్తున్నారు. దీంతో మిగిలిన మహిళలు ఆగ్రహిస్తున్నారు. రావికంపాడులో పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావుతో స్థానిక మహిళలు ఈ అంశంపై గొడవ పడ్డారు.

చీరల పంపిణీ: భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో చీరల పంపిణీ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ సోమవారం నిర్వహించారు. ప్రత్యేకాధికారి రమణయ్యతో కలిసి లబ్ధిదారులకు చీరలు అందజేశారు. ఐకేపీ అధికారులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో శివమాలధారణ

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేట పట్టణంలో పలువురు శివభక్తులు సామూహికంగా శివమాలధారణ చేశారు. స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం వేదమంత్రోచ్ఛారణల మధ్య ఈ కార్యక్రమం సాగింది. ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

అన్నపురెడ్డిపల్లి: శ్రీఅన్నపూర్ణ సమేత శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని స్వామివారికి అర్చకులు, అభిషేకాలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

4.50 కిలోల గంజాయి పట్టివేత

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం కూనవరం రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహించిన ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు 4.50 కిలోల గంజాయిని సోమవారం పట్టుకున్నారు. ఆశాఖ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన మహేశ్, ఆజాదుద్దీన్‌లు సీలేరు నుంచి ఇల్లెందుకు ద్విచక్ర వాహనంలో ఈ గంజాయి తరలిస్తున్నట్లు తనిఖీలో గుర్తించారు. నిందితుల నుంచి ద్విచక్ర వాహనాన్ని, చరవాణులను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశారు.

పందెంరాయుళ్ల అరెస్టు

అశ్వాపురం, న్యూస్‌టుడే: గొల్లగూడెం వద్ద కోడిపందాలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అశ్వాపురం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారినుంచి నాలుగు కోళ్లు, రెండు ద్విచక్ర వాహనాలు, రూ.6,950 నగదును స్వాధీనం చేసుకుని ఎస్సై తిరుపతిరావు కేసు నమోదుచేశారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

దుమ్ముగూడెం: మండలంలోని మసనిమనుగు గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. వాగే సత్యం తన కుటుంబంతో పత్తి చేను వద్ద సాయంత్రం సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. రూ.55వేల నగదు, బంగారం దిద్దులు, బ్యాంకు ఖాతా పుస్తకం, పట్టదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డులు, వంట సామగ్రి, దుస్తులు తదితర సామగ్రి కాలిపోయాయని బాధితులు వాపోయారు.

'రైతు భరోసా' అమలు చేయాలని భారాస ఆందోళన

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా హామీని నెరవేర్చడంలేదని భారాస నాయకులు సోమవారం భద్రాచలం అంబేడ్కర్ సెంటర్‌లో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న భారాస మండల నాయకులు మాట్లాడారు. రైతులకు, రైతు కూలీలకు, కౌలు రైతులకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదని, వర్షాకాలం రైతుబరోసా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మాయ మాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ధ్వంద్వ వైఖరి అవలంబిస్తోందన్నారు. నాయకులు ఆకోజు సునీల్‌కుమార్, పడిసిరి శ్రీనివాస్, వెంకట నర్సయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ భారాస ఆధ్వర్యంలో సోమవారం లక్ష్మీనగరం ప్రధాన సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. పార్టీ నాయకులు మానే రామకృష్ణ, రాంప్రసాద్, రాముడు, జానీపాషా, కామేష్, శ్రీను, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం, న్యూస్‌టుడే: మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర పాలనతో రాష్ట్ర వ్యాప్తంగా రైతులను మోసం చేస్తుందని భారాస మండల అధ్యక్షుడు రావుల సోమయ్య అన్నారు. సోమవారం కరకగూడెం మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో రైతులు, పార్టీ నాయకులు నిరసన, ర్యాలీ నిర్వహించారు. ఊకే రామనాథం, కొమరం విశ్వనాథం, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, ప్రశాంత్, విజయ్, రంజిత్, కనకయ్య, కృష్ణారావు, ఎల్లగౌడ్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన వర్షాకాలం రైతు భరోసాను ఎగ్గొట్టిందని పేర్కొంటూ సోమవారం భారాస ఆధ్వర్యంలో అశ్వాపురంలోని ఆపార్టీ కార్యాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తహసీల్దారు బి.స్వర్ణకు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కోడి


బూర్గంపాడు: ఆందోళన కార్యక్రమంలో నాయకులు

అమరేందర్, మర్రి మల్లారెడ్డి, వీరబ్రహ్మం, సత్యనారాయణ, మల్లారెడ్డి, అశోక్‌కుమార్, గోపిరెడ్డి, పాపారావు, వీరారెడ్డి, సుధీర్, చందూలాల్, వెంకటరామయ్య, రామమూర్తి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు, న్యూస్‌టుడే: ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరుతూ భారాస ఆధ్వర్యంలో బూర్గంపాడు తహసీల్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. భారాస మండలాధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి జక్కం సుబ్రహ్మణ్యం, సాదిక్‌పాషా, వలదాసు సాలయ్య, కొనకంచి శ్రీను, చల్లకోటి పూర్ణ, సూరం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


భద్రాచలంలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న భారాస నాయకులు

కందకాలు తీయించిన రెవెన్యూ అధికారులు

బూర్గంపాడు, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ముజాహిద్ హెచ్చరించారు. సారపాక సమీపంలోని గోదావరితోపాటు బుడ్డగూడెం, ఉప్పుసాక గ్రామాల్లోని కిన్నెరసాని వాగు ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు సోమవారం కందకాలు తీయించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్ఐలు నరసింహారావు, ముత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తాత్కాలిక రహదారి ఏర్పాటుకు గ్రామస్థుల ఆందోళన


ములకలపల్లి, న్యూస్‌టుడే: తమ గ్రామానికి తాత్కాలిక రహదారి పనులను త్వరితగతిన పూర్తిచేయాలంటూ తాళ్లపాయి పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు సోమవారం ఆందోళన చేపట్టారు. దమ్మపేట- పాల్వంచ ప్రధాన రహదారిపై ములకలపల్లి ప్రధాన కూడలిలో బైఠాయించి నిరసన వ్యక్తం తెలిపారు. పాములేరు వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణంలో భాగంగా లోలెవల్ వంతెనను తొలగించిన అధికారులు, తాత్కాలిక రహదారిని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. ఆరు నెలల కిందట తాత్కాలిక రహదారి కోతకు గురవడంతో నేటికీ మరమ్మతులు చేపట్టలేదన్నారు. పాదచారులు, ద్విచక్ర వాహనదారుల కోసం ఇనుప వంతెన ఏర్పాటు చేసినా.. ప్రస్తుతం అదీ ప్రమాదకరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. పనుల పర్యవేక్షణలో విఫలమైన ఐటీడీఏ ఏఈని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులకు అఖిలపక్ష నాయకులు మద్దతు తెలిపారు. గంటపాటు ప్రధాన రహదారిపై కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎస్సై పుల్లారావు ఆందోళనకారులతో మాట్లాడగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వచ్చే వరకు కదిలేదిలేదని వారు భీష్మించారు. గిరిజనుల భద్రత గ్రామస్థులతో మాట్లాడి రెండురోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. గ్రామస్థులు సుందర్‌రావు, ఉదయ్, రాంబాబు, రమ్య, అఖిలపక్ష నాయకులు రమేష్, రాంబాబు, సుధాకర్, రవి తదితరులు పాల్గొన్నారు. ప్రధాన కూడలిలో నిరసన తెలిపిన ప్రజలు అసౌకర్యం కలిగించిన పట్లనలో పరకొంద మందిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.


రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న తాళ్లపాయి పంచాయతీ వాసులు

ఒకవైపు చీకటి.. మరోవైపు ఉక్కపోత

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

మణుగూరు గాంధీబొమ్మ సెంటర్ సమీపంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చీకటి, ఉక్కపోతతోనే మగ్గుతున్నారు. 11 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న ఈ పాఠశాలలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గత ఐదు రోజులుగా పాఠశాలకు విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో చీకటి గదుల్లో కూర్చోలేక ఆరు బయటనే


కరెంటు లేకపోవడంతో తక్కువ వెలుతురులో పాఠశాల తరగతి గది

విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. విద్యుత్ సిబ్బందికి సమాచారమిచ్చినా వారు రాకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. ఈ పాఠశాలను ఐదేళ్ల కిందట మున్సిపల్ అధికారులు మరోచోట గుర్తించారు. అక్కడ పాఠశాల నిర్మాణాలు వర్షాలకు పలు ఆగదలు తన్నారు. ఈ పాఠశాలను ఐటీడీఏ అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా ఎంపికచేసి సుమారు రూ.1.40 లక్షల విలువగల పనులను ఓ గుత్తేదారుకు అప్పగించారు. కానీ ఆ గుత్తేదారు మాత్రం పగుళ్లు ఉన్న గోడలకు సిమెంట్ పూసి, మరుగుదొడ్లకు తలుపుల కూడా బిగించకుండా నామమాత్రపు పనులు చేసి చేతులు దులుపుకున్నాడు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై హెచ్ఎం జయమ్మ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ కరెంటు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, ఉన్న తాగునీరు సమస్యలను స్పందించి కరెంటు సరఫరా చేయించాలని కోరారు. ఆదివాసీరణం పాఠశాలలో నెలకొన్న అనేకరకాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంప్లెక్స్ హెచ్ఎంకు సమాచారం అందిస్తామన్నారు.

కొత్తగూడెం

• కొత్తగూడెం • ఇల్లెందు



ఓటు నమోదు చేయిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఓటు నమోదు చేయించుకోండి

టేకులపల్లి, న్యూస్‌టుడే: ఉన్నత పాఠశాలల్లో 2018 నుంచి 2024 నవంబరు 6వరకు పనిచేసిన ఉపాధ్యాయులు అందరూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తమ ఓటును నమోదు చేయించుకోవాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బీఎం విజయనిర్మల కోరారు. ఖమ్మం-నల్గొండ-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం సులానగర్ జడ్పీ హెచ్ఎస్‌లో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోతీలాల్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

జీఓ 29ని రద్దు చేయండి

టేకులపల్లి, న్యూస్‌టుడే: గ్రూప్-1 ఉద్యోగ నియామకాల్లో మెరిట్ కం రోస్టర్ విధానం పాటించాలని, జీఓ నం.29ను రద్దు చేయాలని ఏజెన్సీ పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు మాళోత్ అశోక్‌బాబు నాయక్ సోమవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ జీఓ వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు ఓపెన్ కేటగిరీలో అర్హత సాధించినప్పటికీ రిజర్వ్ కేటగిరీకి పరిమితం చేశారని ఆరోపించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కొత్తగూడెం: 8008573723
పాల్వంచ: 9550076766
ఇల్లెందు: 9154846689




సమస్య: మూల్లగూడెం పంచాయతీ ప్రభుత్వ పాఠశాల, గుడి సమీపంలో ఉన్న విద్యుత్తు నియంత్రిక ఎత్తు తక్కువగా ఉండి ప్రమాదకరంగా మారింది. గతంలో విద్యుదాఘాతంతో కొన్ని గేదెలు మృతిచెందాయి. విద్యార్థులకు ప్రమాదం పొంచిఉంది. - **ఓ పాఠకుడు**

సమాధానం: నియంత్రిక వద్ద రక్షణ చేర్పాటు చేయిస్తాం. - **లక్ష్మీనర్సింహారావు, చుంచుపల్లి ఏఈ** - చుంచుపల్లి, న్యూస్‌టుడే



✆ పాల్వంచ పట్టణం నటరాజ్‌కూడలిలో డ్రైనేజీలో పూడిక తీయకపోవడంతో మురుగు నీరు దుర్వాసన వస్తోంది. పురపాలక అధికారులు డ్రైనేజీని శుభ్రం చేయించాలి. - **రాము, స్థానికుడు**

✔ ఏరియా జవాన్‌కు చెప్పి సమస్యను పరిష్కరిస్తాం. - **కేవీ లక్ష్మణ్‌రావు, పారిశుద్ధ్య అధికారి**



✆ న్యూ గొల్లగూడెం రాజీవ్‌గృహకల్ప ఎదుటి వీధిలో విద్యుద్దీపం వెలగడం లేదు. ఈ ప్రాంతంలో అంధకారం నెలకొంటోంది. విష సర్పాల సంచారం ఆందోళన కలిగిస్తోంది. - **హసీనా, స్థానికురాలు**

✔ మంగళవారం వెంటనే సంబంధిత సిబ్బందితో వీధిదీపాలు ఏర్పాటు చేయిస్తాం.
- **రాజకుమారి, 16వ వార్డు కౌన్సిలర్**
- పాల్వంచ, న్యూస్‌టుడే

✆ బాదావత్ తండా, ఎన్.కె.నగర్‌లో మురుగుకాల్వలు సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. - **ఓ పాఠకుడు**

✔ పంచాయతీ సిబ్బందితో కాల్వలను శుభ్రం చేయిస్తాం. - **సత్యనారాయణ, ఇన్‌ఛార్జి ఎంపీవో** - చుంచుపల్లి, న్యూస్‌టుడే

కాలువ శుభ్రం

స్పందనకు వందనం



పాల్వంచ గాంధీనగర్‌లో డ్రైనేజీలో పూడిక తీయకపోవడంతో మురుగునీరు స్తంభిస్తోందని స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పురపాలక అధికారులకు సమస్య వివరించారు. స్పందించిన అధికారులు కాలువను సోమవారం శుభ్రం చేయించారు.
- పాల్వంచ, న్యూస్‌టుడే



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్

ప్రజా సమస్యలపై స్పందించండి

కొత్తగూడెం కలెక్టరేట్: 'ప్రజావాణి' దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో అధికారులతో మాట్లాడారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి అర్జీలు అందజేస్తున్నారని, వాటిపై అధికారులు వెంటనే స్పందించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు సమస్యలను ఏకరవు పెట్టారు. లక్ష్మీదేవిపల్లి మండలం మాదిగ ప్రోలు గ్రామానికి చెందిన సి.హెచ్.విజయ మాట్లాడుతూ.. తన భర్త ఏడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడని, ఆ తర్వాత నుంచి కుమారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. కనీసం పింఛను మంజూరు చేయించాలన్నారు. వైద్యారోగ్య శాఖలో నోటిఫికేషన్ లేకుండానే ఆ శాఖకు చెందిన ఓ మాజీ ఉన్నతాధికారి తన బంధువును ఏఎన్ఎంగా నియమించారని కొత్తగూడెంకు చెందిన పి.సంజీవరాజు ఫిర్యాదు చేశారు.

కారడవిలో.. అందాలు.. ఆనవాళ్ల అదరహో

యువతను ఆకట్టుకుంటున్న జలపాతం.. రాకాసి గుహలు



గుహలో నీటి తొట్టి




గుట్టపై పేర్చిన భారీ బండరాళ్లు



ఆదిమ మానవులు వాడిన రోళ్లు



కొండపై తొలిచిన గుహ



ప్రకృతి అందాల నడుమ.. ఆకట్టుకునే ఎత్తైన నిర్మాణాలు

అదో మారుమూల అటవీ ప్రాంతం. సహజ సిద్ధ జలపాతం ఒకటి వర్షా కాలంలో పరవళ్లు తొక్కుతోంది. అది సందర్శకులను ఎంతో ఆకట్టుకుంటోంది. అక్కడకు మరికొంత దూరంలో ఓ కొండ ప్రాంతం విసిరేసినట్టు కనిపిస్తుంది. అక్కడి ప్రకృతి అందాలు, ఆదిమ మానవుల కాలం నాటి ఆనవాళ్లు సందర్శకులను ఆశ్చర్యంలో ముంచెత్తుతున్నాయి. అక్కడకు వెళ్లడం మాత్రం అంత సులువైన పనికాదు..!!

పాల్వంచ మండలంలోని మామిళ్లగూడెం గ్రామం మారుమూల అటవీ ప్రాంతంలో ఉంది. ఇక్కడకు ఆరేడు కిలో మీటర్ల దూరంలో చప్పట్లబావి జలపాతం ఉంది. రెండ మూడు కి.మీ. నడిచి వెళ్తేగానీ ఇక్కడకు చేరుకోలేరు. ఇటీవల వర్షాలతో ఆ ప్రాంతం కొత్తందాలు సంతరించుకోగా.. పాల్వంచ పట్టణం, పరిసర ప్రాంతాల యువత కొందరు సాహసం చేసి సందర్శనకు వెళ్తున్నారు. ఇక్కడ్నుంచి మరో ఏడెనిమిది కి.మీ. దూరంలో కోడిపుంజుల గుట్టపై రాకాసి గూళ్లు ఉన్నాయి. ఆదిమ మానవుల కాలం నాటి పలు విశేషాలను చూసేందుకని పలువురు యువకులు వెళ్లొస్తున్నారు. ఆ ప్రాంతానికి దట్టమైన అడవిలో కాలినడకన అతికష్టమ్మీద వెళ్తున్నారు. రాతి గుహలు, నీటి తొట్లు, రోళ్లు, సమాధులు, స్తూపాలు తదితర విశేషాలను స్మార్ట్‌ఫోన్లలో బంధిస్తున్నారు. ఇక్కడి రాకాసి గుహల వివరాలను సుమారు పన్నెండేళ్ల క్రితం ఖమ్మం ఎస్సార్ బీజీఎన్నార్ కళాశాల చరిత్ర విభాగం అధ్యాపకులు, నిపుణులు సేకరించినట్లు అటవీ శాఖాధికారులు పేరొన్నారు. మామిళ్లగూడెం నుంచి సుమారు పన్నెండు కి.మీ.పైగా కాలిబాట కూడా సరిగా లేని ప్రాంతాల్లోని చారిత్రక, ప్రకృతి అందాల విశేషాలను తెలుసుకోవాలని.. కొందరు యువ సందర్శకులు సాహస యాత్రకు తరచూ తరలిస్తున్నారని సమీప గ్రామాల ప్రజలు 'న్యూస్‌టుడే'తో తెలిపారు. అటవీ ప్రాంతంలో జాగ్రత్తలు పాటించేలా అధికారులు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

– చుంచుపల్లి, పాల్వంచ గ్రామీణం న్యూస్‌టుడే

ఎస్సీ సెల్ కన్వీనర్ శౌరీకి వైరా ఎమ్మెల్యే పరామర్శ

కొత్తగూడెం పట్టణం: రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ జేబీ శౌరీ సోమవారం స్వల్ప గుండెపోటుకు గురయ్యారు. కొత్తగూడెంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేరిన ఆయన్ను వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, పలు పార్టీల నాయకులు పరామర్శించారు. అక్కడ్నుంచి శౌరిని ఖమ్మంలోని ఆసుపత్రికి తరలించారు.

మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, భారాస నాయకులపై కేసు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు పట్టణంలోని పాతబస్టాండ్‌లో ఈ నెల 20న నిరసన కార్యక్రమం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే హరిప్రియతో పాటు 20 మంది భారాస నాయకులపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎటువంటి అనుమతి లేకుండా నిరసన చేసి పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిందన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

ఎన్ఎస్‌యూఐ నాయకుల ఫిర్యాదు..

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రాహుల్‌గాంధీ, అసదుద్దీన్ ఒవైసీలపై సామాజిక మాధ్యమాల్లో వివాదాస్పద పోస్ట్ చేసిన బుద్ధాదిత్య మొహంతిపై ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అజ్మీరా సురేశ్, సంఘం నాయకులు స్థానిక ఒకటో పట్టణ ఠాణాలో సోమవారం ఫిర్యాదు చేశారు.

గని నిర్వాసితులకు డ్రైవింగ్ శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి

టేకులపల్లి, న్యూస్‌టుడే: కోయగూడెం ఓసీ ఏర్పాటుతో నిర్వాసితులైన ధారపాడు, లక్ష్మీపురం, కిష్టారం, కొత్తూరు గ్రామాలకు చెందిన యువకులకు సింగరేణి యాజమాన్యం వోల్వో, లారీ డ్రైవింగ్ శిక్షణ ఇప్పించాలని మహాశక్తి ఆర్గనైజేషన్ సంస్థ అధ్యక్షుడు మాలోత్ దిలీప్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఇర్ప నరేశ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. మహాశక్తి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సుమారు యాభై మంది ప్రభావిత గ్రామాల యువకులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రవీందర్, రాము, కృష్ణ, నితిన్ పాల్గొన్నారు.

8 మంది ఈ అండ్ ఎం అధికారుల బదిలీ

కొత్తగూడెం సింగరేణి: సింగరేణిలో ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగంలో 8 మంది అధికారులను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. బదిలీ అయిన వారిలో డీజీఎం, ఎస్ఈ, డీవైఎస్ఈ స్థాయి అధికారులున్నారు.

శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయాలి: సీపీఐ

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడులో శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేసి పత్తి కొనుగోలు చేయాలని సీపీఐ వైరా నియోజకవర్గ కన్వీనర్ ఎర్రా బాబు డిమాండ్ చేశారు. జూలూరుపాడులో సోమవారం యాసా రోశయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్రకుమార్, సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.కె.నాగుల్‌మీరా, యల్లంకి మధు, వీరభద్రం, చాంద్‌పాషా, తూము కోటయ్య పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్న కాంగ్రెస్ సర్కారు: భాజపా

జూలూరుపాడు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే హామీలను విస్మరించి ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటోందని కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేశ్ అన్నారు. జూలూరుపాడులో సోమవారం నిర్వహించిన భాజపా మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల రుణమాఫీ ఆగస్టు 15వ తేదీ నాటికే చేస్తామని చెప్పిన ప్రభుత్వం డిసెంబరు నాటికి కూడా పూర్తి చేసే పరిస్థితులు లేవన్నారు. కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని సతీశ్, భాజపా మండలాధ్యక్షుడు సిరిపురపు ప్రసాద్, కార్యదర్శి భూక్యా రమేశ్, కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి పుల్లారావు, గోపాలరావు, కృష్ణ పాల్గొన్నారు.

మునగ సాగుపై రైతులకు అవగాహన

టేకులపల్లి: వాణిజ్య పంటలకు ప్రత్యామ్నాయంగా మునగసాగు చేపట్టి రైతులు లాభాలు పొందవచ్చని ఇల్లెందు ఏడీఏ లాల్‌చంద్ సూచించారు. మునగసాగుపై వెంకట్యాతండాలో సోమవారం అవగాహన కల్పించారు. ఉపాధి పథకం ద్వారా ఎకరాకు రూ.లక్ష సాయం అందుతుందని లాల్‌చంద్ తెలిపారు. ఎంపీడీఓ రవీందర్‌రావు, ఏఓ అన్నపూర్ణ, ఎంపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంట భూముల రక్షణకు చర్యలు: కలెక్టర్

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: పాండురంగాపురం పంచాయతీలోని లోతువాగు వద్ద.. కిన్నెరసాని కలిసే చోట పంట భూములు కోతకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులకు సూచించారు. కోతకు గురైన పొలాలను ఉపాధి హామీ పథకం, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. కాల్వ వెంట ప్లాంటేషన్ పనులను కలెక్టర్ పరిశీలించారు. కోతకు గురయ్యే ప్రాంతాల్లో వెదురు మొక్కలు నాటినప్పటికీ ఉపయోగం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ తిరుపతి, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ వివేక్, ఇరిగేషన్ డీఈ రాణి, ఎంపీవో నారాయణ, ఏపీఎం రాంబాబు, ఏపీవో రంగా తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. పాండురంగాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. పాఠశాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల పాఠశాలల క్రీడల్లో రాణించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. క్రీడా సామగ్రికి నిధులు మంజూరు చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, డా.యగంధర్‌రెడ్డి, హెచ్.ఎం. ఉత్తరకుమారి, మాజీ సర్పంచి రమేశ్, జగదీశ్ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్



విద్యార్థులకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత

మేధస్సు వికాసానికి అయోడిన్ ఉప్పు వాడాలి

టేకులపల్లి, న్యూస్‌టుడే: మేధస్సు వికాసానికి అయోడిన్ ఉప్పును తప్పనిసరిగా వాడాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.సుకృత సూచించారు. గ్లోబల్ అయోడిన్ డెఫిషియన్సీ డిసార్డర్స్ ప్రివెన్షన్ డే పురస్కరించుకుని సోమవారం కోయగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సుకు ఆమె హాజరయ్యారు. అయోడిన్ లోపంతో కలిగే వ్యాధులను విద్యార్థులకు వివరించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి బాలాజీ, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి మధువరుణ్, వైద్యాధికారి దినేశ్, హెచ్.ఎం. అమర్‌సింగ్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి: కోరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని, పదవుల కోసం కాకుండా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇల్లెందు పట్టణంలో ఈ నెల 24 నుంచి వార్డుల్లోకి పార్టీ శ్రేణులు వెళ్తూ చేరికలు ఉండేలా పని చేయాలని పేర్కొన్నారు. పుర ఛైర్మన్ డి.వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు డానియేల్, పుర వైస్‌ఛైర్మన్ జానీపాష, అనసూర్య, మాధవరావు, నాయకులు జాఫర్, సదానందం, సాంబమూర్తి పాల్గొన్నారు.

పరుగు పందేల విజేతలకు అభినందన



క్రీడాకారుడు అఖిల్‌కు నిర్వాహకుల అభినందన..

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో కొత్తగూడెం పట్టణం ప్రియదర్శిని డిగ్రీ కళాశాల క్రీడాకారుడు అఖిల్ ప్రతిభ కనబరిచారు. పది కిలోమీటర్ల పరుగు పందెంలో విజేతగా నిలిచి ఆలిండియా యూనివర్సిటీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ నవీన్‌బాబు తెలిపారు. క్రీడాకారుడికి నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీరామనేని చలపతిరావు, ప్రిన్సిపల్ నయాంపాషా, వైస్ ప్రిన్సిపల్ వివేక్, కాశిమల్ల రమేశ్ పాల్గొన్నారు.

ఆలిండియా వర్సిటీ పోటీలకు అఖిల్ ఎంపిక

కొత్తగూడెం సింగరేణి: గుంటూరులో ఈ నెల 19న జరిగిన అంతర్ వర్సిటీల సౌత్‌జోన్ పోటీల్లో కొత్తగూడెం సింగరేణి మహిళా కళాశాల విద్యార్థిని మాలోతు సింధు 4×400 మిక్స్‌డ్ రిలేలో స్వర్ణపతకాన్ని సాధించారు. ఈ నేపథ్యంలో సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్ సోమవారం సింధును అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ చింతా శారద, వ్యాయామ అధ్యాపకురాలు డా.సావిత్రి పాల్గొన్నారు.



సింధును అభినందిస్తున్న శ్రీనివాస్, చిత్రంలో శారద తదితరులు

పంచాయతీ కార్మికులకు నూతన వస్త్రాల అందజేత

చుంచుపల్లి, న్యూస్‌టుడే: యూఎస్‌ఏకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, భార్గవిరెడ్డిల సహకారంతో రామాంజనేయకాలనీ పంచాయతీ కార్మికులకు నూతన వస్త్రాలను సోమవారం పంపిణీ చేశారు. తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, విద్యానగర్‌కాలనీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొల్లు నాగేశ్వరరావు, సురేశ్‌కుమార్, సీతారామశాస్త్రి, పాండురంగారావు, శివరామకృష్ణ, రాజేంద్రప్రసాద్, కామేశ్వరరావు, మాజీ సర్పంచి సరిత పాల్గొన్నారు.

సహపంక్తి భోజనాలు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు సింగరేణి ఏరియా స్టోర్ దుర్గాభవానిమాత ఆలయం ఆవరణలో సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సహపంక్తి భోజనాలను నిర్వహించారు. ఇన్‌ఛార్జి జీఎం కృష్ణమోహన్, అధికారులు పూర్ణచందర్‌రావు, చిన్నయ్య, నాగరాజు, నాయకులు సారయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



రెయిలింగ్‌ను ఢీకొన్న వాహనం: యువకుడి దుర్మరణం

బెజ్జంకి, న్యూస్‌టుడే: రాజీవ్ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా మరొకరు గాయపడ్డారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి వద్ద సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన బోనగిరి మనోజ్(25), కొత్తగూడేనికి చెందిన జోన్ అన్విత్ ఇద్దరు స్నేహితులు. కరీంనగర్‌లో అద్దె గదిలో ఉంటూ ప్రైవేటు కంపెనీల్లో పనిచేస్తున్నారు. పని నిమిత్తం కరీంనగర్ నుంచి ద్విచక్రవాహనంపై సిద్దిపేట వైపు బయల్దేరారు. తోటపల్లి వద్ద ప్రమాదం జరిగింది. గాయపడిన ఇద్దరినీ కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మనోజ్ మృతిచెందాడు. అన్విత్ చికిత్సపొందుతున్నారు.

దర్గాకు వెళ్లి.. గుండెపోటుతో వ్యక్తి మృతి

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు పట్టణం సీతారామ టాకీస్ వెనుక ఉన్న అస్రాఖాన్ మాలిక్ పసుపులేటి సురేందర్ సోమవారం హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందారు. కాజీపేట సమీపంలోని బిజిగిరి దర్గా దర్శనానికి వెళ్లారు. సురేందర్‌కు గుండెపోటు రాగా హన్మంకొండ అనంతరం హైదరాబాద్‌కు చికిత్స కోసం తరలించగా మృతి చెందారు.

4.50 కిలోల గంజాయి పట్టివేత

భద్రాచలం పట్టణం: ఇల్లెందుకు చెందిన మనోజ్, అజారుద్దీన్‌లు సీలేరు నుంచి ఇల్లెందుకు ద్విచక్రవాహనంపై 4.5 కిలోల గంజాయి తీసుకొస్తుండగా.. భద్రాచలంలో కూనవరం రోడ్డు వద్ద ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. సీఐ రమేశ్ నిందితులను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

కుండపోత వర్షం



జూలూరుపాడులో తటాకాన్ని తలపిస్తున్న రహదారి

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడులో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం గంటపాటు కురిసింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు వీధుల్లోకి వరద చేరింది. పడమటినర్సాపురం, కాకర్ల, గుండెపూడి, వెంగన్నపాలెం, జూలూరుపాడు, పాపకొల్లు గ్రామాల్లో వర్షం కురిసింది. పత్తి రైతులు పంట దెబ్బతింటుందని ఆవేదన చెందుతున్నారు.

వేతనాలు పెంచాలని కార్మికుల ఆందోళన

టేకులపల్లి: కేటీసీ నుంచి వివిధ ప్రాంతాలకు బొగ్గు రవాణా చేస్తున్న టిప్పర్ డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు పెంచాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్‌షావలి, మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న డిమాండ్ చేశారు. టిప్పర్ అసోసియేషన్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు.

108 వాహనంలో ప్రసవం

టేకులపల్లి, న్యూస్‌టుడే: బొమ్మనపల్లి గ్రామానికి చెందిన పొగాకు సాయిబాబు భార్య రాజేశ్వరికి పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు సోమవారం టేకులపల్లి 108కి సమాచారం అందజేశారు. 108లో రామవరం ఎంసీహెచ్‌కు తరలిస్తుండగా నొప్పులు తీవ్రం కావడంతో ఈఎంటీ రాధ పైలట్ తరుణ్ సహాయంతో వాహనంలోనే ప్రసవం చేశారు. అనంతరం రామవరం ఎంసీహెచ్‌లో చేర్చారు.

ఎంఈవోకు సన్మానం

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడు మండల విద్యాధికారి జుంకీలాల్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఆయన్ను సోమవారం మండలంలోని స్కూల్ కాంప్లెక్స్ హెచ్.ఎం.లు సన్మానించారు. ఎంఈఓ మాట్లాడుతూ వందశాతం విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కాకర్ల, జూలూరుపాడు, పడమటినర్సాపురం, గుండెపూడి, పాపకొల్లు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కస్తూర్బా గాంధీ, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నిధులున్నా.. రోడ్డు విస్తరణపై నిర్లక్ష్యమేల?

టేకులపల్లి, న్యూస్‌టుడే

మండలంలోని రేగులతండా-దాసుతండా వరకు చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనులు అటకెక్కాయి. కి.మీ. దూరం రోడ్డు విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు సింగరేణి సంస్థ '2022-23' సంవత్సరం సీఎస్సార్ నిధులను రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులను పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో చేపట్టాలన్నది నిర్ణయం. ఆ తర్వాత పాత రోడ్డు తొలగించి కంకర పరిచారు. ఆ తర్వాత వెట్‌మిక్స్ పోశారు. ఈ పనులకు రూ.60 లక్షలు వెచ్చించారు. ప్రస్తుతం పీఆర్ శాఖ ఖజానాలో రూ.1.40 కోట్లు ఉన్నాయి. ఇంతలో ప్రభుత్వం మారింది. పనులకు బ్రేక్ పడింది.

ఇల్లెందు ఏరియాలోని కోయగూడెం ఓసీకి వెళ్లేందుకు రేగులతండా-దాసుతండానే ప్రధాన మార్గం. సింగరేణికి ఇక్కడ రోజుకు రూ.2 కోట్ల విలువైన బొగ్గును ఉత్పత్తి చేస్తోంది. ఈ మార్గం నుంచి భారీ టిప్పర్లు నిత్యం 9 వేల టన్నుల బొగ్గును ఇల్లెందు, కొత్తగూడెం రుద్రంపూర్‌లోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లకు, నవభారత్ తదితర పరిశ్రమలకు తరలిస్తున్నాయి. దీంతో పాటు బోడు ఏజెన్సీ, గుండాల మండలానికి అనుసంధానంగా ఈ మార్గం ఉంది. మండల కేంద్రానికి నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి కీలకమైన రోడ్డులో అర్ధాంతరంగా నిలిచిన విస్తరణ పనులకు పూర్తిచేయాలని, పెట్రాంచెలక స్టేజీ వరకు కూడా మరమ్మతులు చేపట్టాలని సింగరేణి యాజమాన్యాన్ని ప్రజలు కోరుతున్నారు. నిధులున్నా పనులకు గ్రహణం పట్టడానికి రాజకీయ జోక్యం ఓ కారణమై ఉండొచ్చనే ప్రచారం జరుగుతోంది. పనులు మధ్యలో నిలిచిపోవడంతో దుమ్ము ఎగసిపడుతోందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాలతో రోజుకు మూడుసార్లు సింగరేణి వారు ట్యాంకర్లతో నీళ్లు చల్లిస్తున్నారు. ఒక్కోసారి బురద కారణంగా వాహనాలు కూడా అదుపు తప్పి కిందపడుతున్నాయి.



గుంతలమయంగా దాసుతండా రహదారి

"మొత్తం రూ.2 కోట్లలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాం. రూ.60 లక్షల మేర పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది జూన్ కల్లా నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. కానీ గుత్తేదారు నిర్లక్ష్యంతో పనులు ఆలస్యం అవుతున్నాయి. దీనిపై నోటీసులు కూడా ఇచ్చాం. త్వరలో పనులు పూర్తయ్యేలా చొరవ తీసుకుంటాం"
- నవీన్, ఏఈ, పీఆర్, టేకులపల్లి

ప్రమాదాలు జరుగుతున్నా..

ఈ నెల 3న చుక్కాలబోడుకు చెందిన మాళోత్ మంగ్లీ తన భర్తతో కలిసి ద్విచక్రవాహనంపై టేకులపల్లి వచ్చి వెళ్తోంది. వీరి వాహనం దాసుతండా వద్ద గుంతల్లో అదుపుతప్పింది. కింద పడటంతో మంగ్లీ తలకు తీవ్రగాయమైంది. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందింది. వరుస ప్రమాదాలతో ఆందోళన చెందిన స్థానికులు గత నెల 21వ తేదీనే ఆందోళన చేపట్టారు. అప్పట్లో ఎమ్మెల్యే కోరం కనకయ్య వెళ్లి స్థానికులతో సంప్రదింపులు జరిపారు. పక్షం రోజుల్లో రోడ్డు పనులు పునఃప్రారంభించేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఇది జరిగి నెల గడుస్తున్నా ఎలాంటి కదలిక లేకుండాపోయింది.